MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 23 సంచిక: 5 రంగారెడ్డి జనవరి 2025 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ప్రగతి ప్రేరణకు పురస్కారం !




ఢిల్లీలో 'లైవ్లీహుడ్స్ ఇండియా' సమ్మేళనంలో ఏపిమాస్ రెండు దశాబ్దాల ప్రగతి ప్రేరణ ప్రస్థానానికి పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీ సి ఎస్ రెడ్డి, శ్రీమతి రామలక్ష్మి









విజయవాడలో నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభోత్సవ దృశ్యం





'వాష్' ఉత్తమ సి ఆర్ పి ల ప్రశంసా కార్యక్రమం ... వాటర్ ఆర్గ్ ప్రతినిధులతో శ్రీ సి ఎస్ రెడ్డి బృందం

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....

# భూమి, నీటి సంరక్షణ మరియు యాజమాన్యం

భూమిలో సారం ... మొలకకు ఆధారం

కీలక దశలో అందే నీరే పెరిగే పంటకు జీవం

## చేపట్టే పనులు



# మహిళా సాధికారత


సంపుటి 23 సంచిక 5




## స్వాగతం !

సంపాదకీయం

అందరికీ 2025 నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు! దాతృత్వ సంస్థలు, భాగస్వాములు, ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల శ్రేయోభిలాషులు, పాలకవర్గం పెద్దలు, ఏపిమాస్ ఉనికిని సార్థకం చేస్తున్న స్వయంసహాయ సంఘాల, సమాఖ్యల సోదరీమణులు, రైతు మిత్రులు, అభివృద్ధిరంగ నిపుణులు, ఎప్పుడూ అంకితభావంతో తోడ్పాటు అందించే సిబ్బంది, ఏ మాత్రం వెనుకాడకుండా సహాయసహకారాలు అందించే మరెందరో మహానుభావులు ... అందరికీ సామాజిక ప్రగతి గమనంలో ఎన్నెన్నో కొత్త ఆశలను మోసుకువస్తున్న నూతన సంవత్సరంలోకి సాదర స్వాగతం! అప్పుడే ఏడాది గడిచిందా..! అని ఆశ్చర్యపోయేలా 2024 వ సంవత్సరం చకచకా సాగిపోయినట్టు అనిపిస్తున్నది. ఆహ్వానాలు, పర్యటనలు, సమావేశాలు, అధ్యయనాలు, నివేదికలు, కార్యాచరణ ప్రణాళికలు, విధాన రూపకల్పనలపై సంప్రతింపులు, సూచనలు, నూతన భాగస్వామ్యాలు, పురస్కారాలు, సరికొత్త బాధ్యతలు ... యిలా సంవత్సరమంతా ఏపిమాస్‌కు ఊపిరిసలుపుకోనివ్వనంత వేగంగా, నిత్యనూతనంగా సాగింది. సామర్థ్యం పెంపుదల, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు సరేసరి! అనంత కాలచక్ర పరిభ్రమణంలో ఒక ఏడాది కాలం చాలా చాలా స్వల్పమే కావచ్చుకాని, ఆ అత్యల్పకాలపు కొన్ని సంఘటనలు, కార్యక్రమాలే చరిత్ర గమనాన్నే మార్చేవి కావచ్చు! ముఖ్యమైన కొన్ని సంఘటనలను, కార్యక్రమాలను పరిశీలిస్తే 2024 సంవత్సర ప్రారంభంలోనే తెలంగాణాలో వ్యవసాయ వ్యూహాల సదస్సును, ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్ పి ఓలలో మహిళా రైతులకు ప్రాధాన్య కల్పనపై కార్యశాలను నిర్వహించి ఏపిమాస్ తన ప్రాధాన్యాలను మరోమారు చాటిచెప్పింది. తెలంగాణాలో అనుసరించదగిన వ్యవసాయ వ్యూహాలపైన, ఆంధ్రప్రదేశ్‌లో స్వయంసహాయ సమాఖ్యలు, ఎఫ్ పి ఓల పనితీరుపైన అధ్యయనంచేసి నివేదికలు సమర్పించింది. ఆర్థికపరంగా ఎఫ్ పి ఓల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించవలసిన విధానాల రూపకల్పనకు అనువుగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ తోడ్పాటుతో ఏపిమాస్ ఢిల్లీలో సదస్సు నిర్వహించి, ఎఫ్ పి ఓల నిర్వహణలో ప్రభుత్వం వాస్తవిక దృక్పథంతో, ఆచరణాత్మక ధోరణిలో వ్యవహరించడానికి తనవంతు కృషిచేసింది. ఎఫ్ పి ఓల అభివృద్ధిపట్ల ఏపిమాస్ అంకితభావాన్ని గుర్తించిన కేంద్రప్రభుత్వం 'ఎఫ్ పి ఓల నిర్వహణ మార్గదర్శకాల సవరణ సంఘంలో ఏపిమాస్ సి ఇ ఓకు సభ్యత్వం కల్పించడం ఒక విశేషం. సామాజిక ప్రగతి గమనాన్ని వేగిరపరిచేలా ప్రభుత్వాల విధానాల, రూపకల్పన, సవరణలకోసం అటు ప్రభుత్వాలతో, యిటు తోటి స్వచ్ఛంద, సహకార సంస్థల ప్రతినిధులతో వివిధ స్థాయిలలో సంవత్సరం పొడవునా ఏపిమాస్ ఎన్నెన్నో సంప్రతింపులు సాగించింది. ఇంతే కాకుండా ఎఫ్ పి ఓల కు ఉజ్వల భవిష్యత్తుపై భావసారూప్య సంస్థలతో ఢిల్లీలో సమాలోచనలు జరిపి, నిర్దిష్ట కార్యాచరణ రూపకల్పనలో పాలుపంచుకున్నది. స్వయంసహాయ వ్యవస్థను మరింత ఉత్తేజితం చేయాలన్న సత్సంకల్పంతో మూడేళ్ళ క్రితం ఏపిమాస్ ప్రారంభించిన 'ఉత్తమ సమాఖ్యలకు జాతీయ పురస్కారాల ప్రదానం' వరుసగా నాల్గవ ఏడాదికూడా కొనసాగింది. కాలపరిమితి పూర్తకావడంతో 'పాడిపంటలు' ప్రాజెక్ట్ అశావహంగా ముగియగా, కొత్తగా 'రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ ప్రాజెక్ట్' ను కొన్ని సహభాగస్వామ్య సంస్థలతోకలసి ఏపిమాస్ చేపట్టింది. కొత్తగా 'వృత్తి' సంస్థతో, 'భారత జాతీయ సహకార మండలి' (ఎన్ సి యు ఐ) తో అవగాహన ఒప్పందాలు కుదరడం మరో విశేషం. మరికొన్ని సంస్థలతో కూడా అవగాహన కుదరనున్నది. 'వాష్' రుణాలను సమకూర్చడంలో విశేషకృషిచేసిన అత్యుత్తమ ప్రోత్సాహక సంస్థగా 'సా-ధన్ ' జాతీయ పురస్కారం, తెలంగాణాప్రభుత్వం ' మూసీ నిర్వాసితుల జీవనోపాధుల కమిటి' సభ్యత్వం, సంవత్సరం ముగిసే తరుణంలో 'లైవ్లీ హుడ్స్ ఇండియా' సంస్థ నుంచి అందిన ప్రగతి ప్రేరణ పురస్కారం కొత్తసంవత్సరంలో ఏపిమాస్ బాధ్యతను మరింత పెంచుతున్నాయి. ఈ పురస్కారాలు, నియామకాల రూపంలో ఏపిమాస్ క్రియాశీలత్వాన్ని గుర్తించిన వారందరికి ధన్యవాదాలు. 2025 సంవత్సరం అంతర్జాతీయ సహకార సంవత్సరం. ఈ సందర్భంగా సంవత్సరం పొడవునా సహకార వ్యవస్థ బలోపేతానికి ఉద్దేశించి ఏపిమాస్ యిప్పటికే కార్యాచరణ ప్రణాళికను సిద్ధంచేసింది. మరెన్నో నూతన కార్యక్రమాలు, అవగాహనలు, భాగస్వామ్యాలతో ఆశావహ భవిష్యత్తును ఆకాంక్షిస్తూ కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నది. సహాయ సహకారాలతో అశీర్వదించండి.




**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**


ముందు నీవేమిటో తెలుసుకో, ఆపై నిన్ను నీవు మలుచుకో ; నీ సృష్టికర్తవు నీవే !

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: ఎన్ వినాయక రెడ్డి, ఎల్. భవాని, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మచారి, ఎస్. ప్రహ్లాదయ్య**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి , సాంకేతిక సహకారం: బి మౌళి**

## లోపలి పేజీలలో ....

➪ ఏపిమాస్‌కు 'ప్రగతి ప్రేరణ' పురస్కారం! 05
➪ ఏడాదిలోపే సత్తా చాటిన స్నేహ మహిళా సంఘం 06
➪ సీమ నీటి ప్రాజెక్టులో కార్యక్రమాల తీరూతెన్ను 07
➪ 8 గ్రామాల రైతుల వ్యవసాయం, వ్యాపారం ! 09
➪ వ్యవసాయపరిశోధన సంస్థ డైరెక్టర్‌గా తెలుగు వ్యక్తి 09
➪ సమన్వయ సాధనతోనే ఎఫ్ పి ఓల విజయం! 10
➪ కుటుంబానికి ఏడెకరాలకు 'రైతు భరోసా' ! 13
➪ మహిళా స్వయంసహాయ సంఘాలకు 'సౌరశక్తి' 14
➪ ఆంధ్రప్రదేశ్‌లో రైతుల రుణాల రీషెడ్యూల్ 16
➪ సాగునీటి సంఘాలకు సమస్యల సవాల్ 17
➪ జానపద నర్తనంతో.... జాతీయ 'ప్రకాశం' ! 18
➪ ప్రకాశం డ్వామాలో అవకతవకలపై విచారణ 20
➪ వానాకాలంలో ఆరోగ్యకర ఆహారం 21
➪ చిత్తూరు జిల్లాలో ఫలిస్తున్న ప్రకృతి వ్యవసాయం! 22
➪ కుంకుడు సాగుతో జాతీయ పురస్కారం! 24
➪ కోటీశ్వరులను చేసే జి ఎస్ టి బిల్లులు ! 25
➪ అధిక వర్షాలు,తెగుళ్ళతో మామిడిదిగుబడిపై దిగులు 26
➪ ఆదాయ మార్గంగా చిరుధాన్యాల టిఫిన్‌లు ! 27
➪ క్యాన్సర్‌ను జయించి... వ్యాపారంలో రాణించి ... 28
➪ బానపొట్టను కరిగించే బహు భేషైన పండ్లు ! 30
➪ ఇంటి ముందు ఇల్లాలి పేరుతో సాధించిన విజయం 32
➪ మనకు మార్కెట్‌లో దొరకని సంజీవని కూరగాయ 34

## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'**మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడంకోసం 'మహిళా సాధికారత 'పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

పొరపాటుకు మన్నింపు కోరడం నిజాయతీ ,పొరపాటుకాకున్నా మన్నింపు కోరడం అనుబంధాన్ని గౌరవించడం

# ఏపిమాస్‌కు 'ప్రగతి ప్రేరణ' పురస్కారం!

స్వయంసహాయ వ్యవస్థ, మహిళా సాధికారత, పేదరిక నిర్మూలన, రైతుల అభ్యున్నతి, ఆదర్శ గ్రామ నిర్మాణం, పట్టణ మహిళల పోషణ, ఆరోగ్య సంరక్షణ, పారిశుధ్యం, యువతకు నైపుణ్యం పెంపుదల, జీవనోపాధుల కల్పన, వాటర్‌షెడ్‌ల నిర్వహణ వంటి వివిధ కార్యక్రమాల ద్వారా ఏపిమాస్ రెండు దశాబ్దాలకు పైగా సమాజాభివృద్ధికి ఫలప్రదంగా ఎనలేని విశేష కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేంద్రస్థానంగా 2001లో మొదలైన ఈ సామాజిక సేవా నిరతి జాతీయ, అంతర్జాతీయ



స్థాయిలకు కూడా విస్తరించి ఏపిమాస్ అభివృద్ధికి చిరునామాగా మారింది.

స్ఫూర్తిదాయకమైన ఈ ప్రగతి ప్రస్థానం ఏపిమాస్‌కు ఎన్నో అభినందనలను, ప్రశంసలను, పురస్కారాలను తెచ్చిపెట్టింది. తాజాగా డిసెంబర్ 19-20 తేదీలలో యాక్సెస్ సంస్థకు చెందిన 'లైవ్లీ హుడ్స్ ఇండియా' ఢిల్లీలో నిర్వహించిన సమ్మేళనంలో ఏపిమాస్‌ను '20 ఏళ్ళకు పైగా సామాజికాభి వృద్ధికి ప్రేరణకర్త'గా ప్రశంసిస్తూ, పురస్కారాన్ని ప్రదానం చేసింది.

ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి రామలక్ష్మి స్వీకరించారు.

ఈ సమ్మేళనంలో మహిళల వ్యాపార నైపుణ్యాభివృద్ధి గురించి విస్తృత చర్చ జరిగింది. వ్యాపార విస్తరణ కేవలం 10 శాతం మాత్రమే విజయవంతమవుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయని, అయినప్పటికి ఎన్నో సవాళ్ళ మధ్య కూడా మహిళా వ్యాపార సంస్థలు గణనీయంగా ప్రగతిపథంలో ముందడుగు వేస్తున్నాయని సమావేశం అభిప్రాయపడింది. మహిళా వ్యాపార సంస్థల ఇతోధిక పురోగతి కోసం జాతీయ స్థాయి వ్యవస్థీకరణపై జరిగిన సమావేశం ప్రధానంగా బైలాలు, సభ్యత్వ తీరుతెన్నుల వంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించింది.

**బి ఏ ఎఫ్ ఏ సమావేశం**

శ్రీ సి ఎస్ రెడ్డి, శ్రీమతి రామలక్ష్మి 'ఎఫ్ పి ఓల వ్యవస్థ వేగవంతానికి భారత ఐక్య సంఘటన (బి ఏ ఎఫ్ ఏ) సమావేశంలో కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో మొత్తం 42 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ఐక్య సంఘటన ఏర్పాటుకు దాదాపు ఏడాది కాలంగా జరుగుతున్న ప్రయత్నాలను సమావేశం చర్చించింది.రైతు ఆదాయం పెరుగుదలే బి ఏ ఎఫ్ ఏ ప్రధాన అశయం కనుక, ఆదాయాన్ని పెంచుకునే మార్గాలతో పాటు, సాగునీటి వనరుల పునరుద్ధరణ, సేంద్రియ ఎరువుల వినియోగం వంటి చర్యల ద్వారా ఖర్చులను తగ్గించుకునే కృషికి కూడా ప్రాధాన్యం యివ్వాలని, వ్యాపారంతో పాటు క్రమేణా పర్యావరణ పరిరక్షణపై కూడా దృష్టి పెట్టేలా ఎఫ్ పి ఓలను సన్నద్ధం చేయాలని సమావేశం అభిప్రాయపడింది.

బి ఏ ఎఫ్ ఏ ను ఒక పటిష్ఠమైన సంస్థగా ఏర్పాటు చేయడానికి మూడునెలల కార్యాచరణ పథకంపై అంగీకారం కుదిరింది. మూడు నెలల కార్యాచరణను అశించిన విధంగా ముందుకు తీసుకువెళ్ళే బాధ్యతను నిర్వర్తించడానికి ఏపిమాస్, వృత్తి, సి ఎం ఎఫ్ సంస్థలు సన్నద్ధమవుతున్నాయి. మొత్తంమీద ఎఫ్ పి ఓలను విజయవంతమైన వ్యాపార సంస్థలుగా తీర్చిదిద్దడానికి వేగవంతమైన కృషి జరపడానికి భాగస్వామ్య సంస్థలు ఎంతో ఉత్సాహంగా వున్నాయని ఈ సమావేశం నిరూపించింది. ■

గెలుపుకోసం పని చేయడం ప్రవీణుణ్ణి చేస్తే , సంతృప్తికోసం పని చేయడం మహనీయుణ్ణి చేస్తుంది

# ఏడాదిలోపే సత్తా చాటిన స్నేహ మహిళా సంఘం!

**– జాహ్నవి ఎర్రబెల్లి**

ఏపిమాస్ పట్టణ పోషణ పథకం కృషి ఫలితంగా హైదరాబాదు కార్వాన్ ప్రాంతంలోనిఖాలికబర్‌లో 'స్నేహ మహిళా సంఘం' ఏర్పడింది. ఈ సంఘంలో పదిమంది గృహిణులు తమ సమాజంలో సానుకూల మార్పు కోసం ముందుకు వచ్చారు. ఏపిమాస్ బృందం , ఆరోగ్య కార్యకర్త ఫరీన్ దేవి, స్థానిక మహిళల ఉత్సాహాన్ని గుర్తించి, వారి సామాజిక, ఆర్థికాభివృద్ధికి కోసం వారిని సంఘటిత



పరచాలని సంకల్పించారు. ఆ ప్రాంత మహిళలను సంఘటితంచేసి స్వయం సహాయ సంఘం ఏర్పాటు ప్రక్రియను వివరించి, అవసరమైన సహాయాన్ని అందించారు. వారి సొంత నాయకత్వంలో, సంఘం ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలపై ఆ మహిళలకు అవగాహన కల్పించారు.

ఏర్పాటైన పది నెలల్లోనే లక్ష యాభై వేల రూపాయిల రుణం పొందడంలో 'స్నేహ మహిళా సంఘం' సఫలీకృతమైంది. ఈ రుణాన్ని సాధించ గలగడం మహిళల ఆర్థిక సామర్థ్యంపై ఉన్న అపోహలను కూడా బద్దలు కొట్టింది.

33 సంవత్సరాల వయసుగల షాజియా బేగం, ఈ సంఘానికి నాయకత్వం వహిస్తున్నారు. ఆమె తన విద్యార్హత (ఎస్ఎస్‌సి) తో పాటు తన బ్యూటీ పార్లర్ వ్యాపార నిర్వహణ అనుభవంతో, తన సంఘం సభ్యులకు వ్యాపార నైపుణ్యాలు నేర్పి స్ఫూర్తి కలిగించారు. షాజియా సభ్యులకు వ్యాపార నిర్వహణ, వినియోగదారులతో మెలగవలసిన తీరుతెన్నులు, వ్యక్తిత్వ అభివృద్ధి వంటి అంశాలలో తగిన శిక్షణ యిచ్చారు.

ఒకే రంగంపై ఆధారపడకుండా, షాజియా టైలరింగ్ శిక్షణ ప్రారంభించి సభ్యులకు కొత్త నైపుణ్యాలను అందించారు. ఈ ప్రగతిశీల దృక్పథం ఆర్థిక శ్రేయస్సుకు పునాది వేసింది. ఈ విజయం ఆర్థిక లాభాలకే పరిమితం కాకుండా సంఘ సభ్యులలో ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలు, సామాజిక ప్రతిష్ట పెరగటానికి ఎంతగానో దోహదపడింది.

వీరు తమ సంఘటిత శక్తితో, విభిన్న ఆర్థిక అవకాశాలతో మరింత ఉజ్వల భవిష్యత్తు కోసం సమాజం లోని మహిళలను స్ఫూర్తిపరుస్తున్నారు. ఈ ఉత్సాహంతో మరో మూడు కొత్త సంఘాల ఏర్పాటుకి సనద్ధమవుతునారు. ■



**సంతోషంగా వుండడం నేర్చుకో, అదే అలంకారమవుతుంది, అలవాటవుతుంది, సంతోషాన్ని తెస్తుంది**

# సీమ నీటి ప్రాజెక్టులో కార్యక్రమాల తీరూతెన్ను

**రా**యలసీమ వాటర్ ఇనిషియేటివ్ ప్రాజెక్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, అన్నమయ్య జిల్లా మదనపల్లె, కురబలకోట మండలాలలోని 14 గ్రామ పంచాయతీలలో 1. నీటి సంరక్షణ 2. ప్రకృతివ్యవసాయం పెంపుదల 3. సముదాయ యాజమాన్యం అంశాలపై అమలు జరుగు తున్నది. ఈ ప్రాజెక్టులో పని చేస్తున్న యిద్దరు సముదాయ కార్యకర్తలు తాము నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరిస్తున్నారు. తద్వారా, ఈ ప్రాజెక్టు గురించిన ప్రాథమిక అవగాహన కలుగుతుంది. ఆ విశేషాలను చూద్దాం.

**సంధ్య సాగించే కృషి**

నా పేరు సంధ్య. నేను సముదాయ కార్యకర్తగా మదనపల్లె మండలం చిన్న తిప్పసముద్రం (సి టి యం) పంచాయతీలో పని చేస్తున్నాను. ఈ పథకంలో ముఖ్యాంశమైన ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించడానికి చిన్న, సన్నకారు రైతులను కలుసు కుని, "మీరు పెరటితోటలు పెంచు కొని, మీరు పండించే ఆహార పంటలను రసాయనాలు వాడకుండా పండించి మీ ఆరోగ్యం, కాపాడుకోవచ్చు, సమాజ ఆరోగ్యం కాపాడవచ్చు" అని వారికి అవగాహన కలిగిస్తున్నాను. ప్రకృతి వ్యవసాయం, స్థానిక వనరులను వినియోగించడం వల్ల సాగుఖర్చులు తగ్గి అందరి ఆరోగ్యం మెరుగుపడు తుందనే వాస్తవాన్ని వారు గ్రహించేలా చేస్తున్నాను. అధిక







వేలాతాదులో రసాయనాలు వాడిన వ్యవ సాయ ఉత్పత్తు లను తినడం వల్ల వచ్చే అనేక ఆరోగ్య సమస్యలను వారి దృష్టికి తెస్తున్నాను.

పంటలకు కావలసిన ఎరువులను, పురుగుమందులను ఆవు పేడను, మూత్రాన్ని, స్థానికంగా లభ్యమయ్యే యితర పదార్థాలను ఉపయోగించి తయారుచేసుకోవచ్చునని చెప్పి జీవామృతం, పంచగవ్య లాంటి భూసారం పెరిగే ద్రావకాలను తయారు చేయించి వినియోగింపజేశాను. జనుము, ఉలవ వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేయించాను. నా కార్య నిర్వహణ పరిధిలోని గ్రామాలలో నా తోటి సి ఆర్ పి ల సహకారంతోఇంటింటి సర్వే, భూములకు సంబంధించి ఈ పి ఆర్ ఎ, పశువుల సమాచారం, బోరు బావులలో నీటి లోతు కొలతలు తీయడం జరిగింది.

**కవిత కార్యాచరణ**

నా పేరు కవిత, గొల్లపల్లి గ్రామం, దుబ్బిగానిపల్లి పంచాయతి, మదనపల్లి మండలం. నేను రాయలసీమ వాటర్ ప్రాజెక్టులో సముదాయ కార్య కర్తగా దుబ్బిగానిపల్లి పంచాయతీ లో ప్రాజెక్టు కార్యక్రమాల అమలు కోసం రైతులతో కలసి పని చేస్తున్నాను. స్థిరమైన నీటి నిర్వహణ ద్వారా, ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా పంట భద్రతను పెంపొందించి, చిన్న రైతులకు కరువును తట్టుకో గలిగే సామర్థ్యాన్ని పెంపొందించడం మా ప్రాజెక్టు లక్ష్యం .



ఆనందం బయట దొరికేదో, కొనగలిగేదో కాదు ; నీలోనే వుండేది , ఆత్మీయతను పంచి పొందగలిగేది



నేను ప్రకృతి వనరులను గుర్తించి, వాటి వలన కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేస్తుంటాను. నీటి కుంటల, కాలువల, చెరువుల స్థితిగతులు తెలియజేసి, గ్రామ కమిటి ఆధ్వర్యంలో నిపుణుల తోడ్పాటుతో మరమ్మతు కార్యాచరణ ప్రణాళికలను తయారు చేస్తున్నాము. ఇంతే కాకుండా, ప్రకృతి వ్యవసాయ విధానాలను, రసాయన వ్యవసాయం వలన కలిగే దుష్ప్రభావాలను తెలియజేసి, జీవామృతం, బీజామృతం లాంటి సేంద్రియ ద్రావకాలను రైతుల పొలాలలో తయారుచేసి రైతులతో వినియోగింపజేస్తున్నాను.

**నేను ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాలు :**

1. ప్రాజెక్టు ద్వారా జరిగే శిక్షణలకు హాజరవడం, ఆ పద్ధతులను ఆకళింపు చేసుకోవడం.
2. రైతులను కలుసుకుని, వారికి ప్రాజెక్టు కార్యక్రమాలను తెలియపరచడం, కార్యక్రమాల అమలుకు ప్రాజెక్టు సిబ్బందితో కలసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం.
3. జీవామృతం, బీజామృతం మరియు పంచగవ్య తయారీ విధానం నేర్చుకొని, రైతుల పొలాల వద్దకు వెళ్ళి, వారితో తయారుచేయించడం.
4. వాటర్ షెడ్ సిబ్బందితో కలసి, ఐదు నీటి కుంటలు చేయించాము, గట్లపై స్టైలో హమాట గడ్డి విత్తనాలను చల్లించాము.
5. మూడు గ్రామాలలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేశాము. ప్రాజెక్టు కార్యక్రమాలు ఈ కమిటీల ద్వారా అమలు జరుగుతాయి. ■

## బి సి మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం బీసీలకు అందించిన పథకాలను తిరిగి తీసుకురావాలని సంకల్పించింది కూటమి ప్రభుత్వం. మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని బీసీ సంక్షేమశాఖను ఆదేశించింది. మహిళలకు స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు పలు సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించింది. నైపుణ్యాభివృద్ధితోనూ ఒప్పందాలు పూర్తయినట్లు సమాచారం.

ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 80 వేల మంది బీసీ మహిళలకు లబ్ధి చేకూరనుంది. 90 రోజుల టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ఒక్కొక్కరికి రూ.24 వేలు విలువగల కుట్టుమిషన్ ఉచితంగా అందించనుంది ప్రభుత్వం. ఇప్పటికే ఓబీఎంఎస్ సైట్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించేందుకు సన్నాహాలు ప్రారంభించింది.

## యువతకు జనరిక్ షాపులు

ఉన్న ఊళ్లో ఉద్యోగం దొరక్క, సిటీలకు వెళ్లే తాహతు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయిన యువతకు శుభవార్త అందించనుంది ఏపీ సర్కారు. నేరుగా ప్రభుత్వ సాయంతో స్వయం ఉపాధి పొందేందుకు ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగరాలు, పట్టణాలు, మండలాల్లో నివసించే నిరుద్యోగ బీసీ యువతకు జనరిక్ షాపులు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించనుంది. జనరిక్ మందుల వాడకం పెరిగేలా చేస్తూనే బీఫార్మసీ, ఎంఫార్మసీ చదివి ఖాళీగా ఉన్న వారికి బీసీ సంక్షేమశాఖ తరపున రూ.8 లక్షల రుణం అందించనుంది. ఇందులో రూ.4 లక్షలు సబ్సిడీగా ఇస్తారని తెలుస్తోంది. సీఎం అనుమతి పొందిన వెంటనే బీసీ కార్పొరేషన్ ద్వారా ఈ పథకాలు అమలులోకి రానున్నాయి. ■

# 8 గ్రామాల రైతుల సంఘటిత వ్యవసాయం, వ్యాపారం!

ఎనిమిది గ్రామాల రైతులు చేయిచేయి కలిపారు... ఒక్కొక్కరు రూ. 1,650 చెల్లించి సభ్యత్వం తీసుకొన్నారు.. ఓవైపు పంటలు సాగుచేస్తూనే మరోవైపు వ్యాపారంపై దృష్టి సారించారు. సంఘటితంగా ముందుకు సాగడంతో గత మూడేళ్ల కాలంలో ఒక్కో రైతు షేర్ క్యాపిటల్ విలువ రూ. 4 వేలకు చేరడం గమనార్హం.

గోనెగండ్ల మండలంలోని కులుమాల, అలువాల, పెద్దనెలటూరు, చిన్ననెలటూరు, హెచ్.కైరవాడి, పుట్టపాశం, వేముగోడు, లింగందిన్నె తదితర గ్రామాల రైతులు కలిసి శ్రీనల్లారెడ్డి స్వామి ఎఫ్ పి ఓను (రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని) 2019–20లో ఏర్పాటు చేశారు.

ఏపిమాస్ సంస్థ మార్గదర్శకత్వంలో, ఉద్యాన శాఖ తోడ్పాటుతో కలసికట్టుగా ముందుకు' సాగు'తున్నారు. రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలుచేసి వాటిని కలెక్షన్ సెంటర్‌లో, శీతల గిడ్డంగుల్లో నిల్వచేసి, శుద్ధి చేసి, గ్రేడింగ్ చేయించి విక్రయిస్తున్నారు.

**ఎరువులు, విత్తన వ్యాపారం**

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలకు సంబంధించి లైసెన్సు తీసుకొని వ్యాపారం ప్రారంభించి లాభాలు గడిస్తున్నారు. 2022–23లో రూ. 3.50 లక్షలు, 2023–24లో రూ. 8.50 లక్షలు ఆర్జించారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ. 9 లక్షల ఆదాయ లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు.

రెండు తెలుగు రాష్ట్రాలో ఏపీమాస్ పర్యవేక్షణలో ఉండే 80 రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో మొదటి స్థానంలో నిలిచారు. "ఉద్యాన శాఖ ద్వారా కలెక్షన్ కేంద్రం, పంట ఉత్పత్తుల రవాణాకు వాహనం అందిస్తే మరింత ముంద డుగు వేయగలుగుతామని, ప్రభుత్వ శాఖలు రాయితీలు ఇచ్చాయని' సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. ■

## భారత వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్‌గా తొలి తెలుగు వ్యక్తి

భారత వ్యవసాయ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఎఆర్ఐ) డైరెక్టర్ గా తొలిసారి ఓ తెలుగు వ్యక్తి నియమితు లయ్యారు.




ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. చెరుకుమల్లి శ్రీనివాసరావు స్వస్థలం ఉమ్మడి కృష్ణా జిల్లా అనిగండ్ల పాడు గ్రామం. ఆయన 1965 అక్టోబరు 4న జన్మించారు. బాపట్ల అగ్రికల్చర్ కాలేజీలో బీఎస్సీ పూర్తి చేశారు. ఢిల్లీలో అగ్రికల్చరల్ ఎమ్మెస్సీ, పీహెచ్ డీ పూర్తి చేశారు.

ఉన్నత విద్యాభ్యాసం అనంతరం పలు పరిశోధన సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం ఆయన నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) డైరెక్టర్‌గా ఉన్నారు. ■

కష్టాలకు కొందరు కుంగిపోతారు, మరి కొందరు మరింత ఉత్తేజం పొందుతారు ; అదే వ్యక్తిత్వం !

# సమన్వయ సాధనతోనే ఎఫ్ పి ఓల విజయం!

– ఎస్.ప్రహల్లాద

**స**న్నకారు, చిన్న రైతులు తమకు అవసరమైన వివిధ రకాల ఉత్పాదకాలను తక్కువ ధరలకు అందుకుంటూ, తాము పండించిన పంటలను సముచిత ధరలకు అమ్ము కొనడానికి వేదికలుగా ఎఫ్ పి ఓలను (రైతు ఉత్పత్తిదారు సంస్థలను) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న విషయం అందిరికి విదితమే. ఒకవైపు ప్రభుత్వ విభాగాలు, మరొకవైపు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన ఎఫ్ పి ఓలు ఆశించిన పురోగతి సాధించడం వలన కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి సన్న, చిన్నకారు రైతు ఎఫ్ పి ఓ లలో చేరి, వారికి కావలసిన సేవలు వారే పొందాలని ఆకాంక్షించి దేశవ్యాప్తంగా 10వేల ఎఫ్‌పిఓలను ఏర్పాటు చేయాలని 2021లో సంకల్పించి వాటి నిర్వహణ కొరకు 6 వేల 865 కోట్ల రూపాయలు కేటాయించింది.

ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలుచేయడం కోసం కేంద్ర ప్రభుత్వ పరిధిలో స్వతంత్రంగా వ్యవహరించే నాలుగు సంస్థలను "పథకం అమలు సంస్థలు"గా ఎంపిక చేసింది. అవి నాబార్డు, ఎన్.సి.డి.సి, ఎస్.ఎఫ్.ఏ.సి, నాఫేడ్. ఈ నాలుగు సంస్థలు గ్రామాలలో రైతు ఉత్పత్తి దారుల సంస్థలను ఏర్పాటు చేసి, వాటిని బలోపేతం చేయడం కోసం "క్లస్టర్ స్థాయి వ్యాపార సంస్థలు" (సిబిబిఓ) గా కొన్ని స్వచ్ఛంద సంస్థలను ఎంపిక చేసి, ప్రతి స్వచ్ఛంద సంస్థకు గరిష్టంగా 50 రైతు ఉత్పత్తిదారుల సంస్థలను కేటాయించింది.

స్వచ్ఛంద సంస్థలతో పాటు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, జిల్లా పశువైద్య శాఖ మొదలగు కొన్ని ప్రభుత్వ విభాగాలను "క్లస్టర్ స్థాయి వ్యాపార సంస్థలు" గా (సి.బి.బి.ఓ.) ఎంపిక చేసి, వాటి ద్వారా గ్రామాలలో కూడా ఎఫ్ పి ఓలను ఏర్పాటు చేస్తున్నది. వీటితో పాటు ఉ ద్యానశాఖ వారు కూడా స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఎఫ్ పిఓలను ఏర్పాటు చేస్తున్నారు.

**నిర్వహణ నిధుల అందుబాటు**

ప్రతి ఎఫ్ పిఓ నిర్వహణ కోసం, అంటే కార్యాలయం అద్దె, సిబ్బంది వేతనాలు, సమావేశ ఖర్చులు మొదలగు వాటకోసం కేంద్ర ప్రభుత్వం మూడు సంవత్సరాల కాలానికి 18 లక్షల రూపాయలు కేటాయించింది. అంతేగాక ప్రతి సంస్థ కూడా తమ సభ్యుల వ్యాపార అవసరాలకు పెట్టుబడి కోసం ఈక్విటి నిధుల రూపేణా గరిష్ఠంగా 15.0 లక్షల రూపాయలు పొందుటకు అవకాశం వున్నది. ఎఫ్ పిఓ లను ఏర్పరచి, వాటిని బలోపేతం చేయడం కోసం ప్రతి క్లస్టర్ స్థాయి వ్యాపార సంస్థకు సంవత్సరానికి ఐదు లక్షల రూపాయల చొప్పున ఐదు సంవత్సరాల కాలానికి నిధులు మంజూరు చేస్తున్నది.

అయితే, ఎఫ్ పి ఓలకు నిర్వహణ నిధులను, ఈక్విటి నిధులను మంజూరు చేయడానికి ప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. అందులో ప్రధాన మైనది సభ్యత్వం. ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ కూడా నిర్వహణ నిధులు పొందాలంటే కనీసం 300 మంది రైతులు సభ్యులుగా వుండాలి.

**ప్రగతి:** అందుబాటులోని లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా 2024 జూన్ నాటికి 8875 ఎఫ్ పి ఓ లు ఏర్పాటయ్యాయి. వీటిలో 19,68,868 మంది రైతులు వాటాదారులుగా వున్నారు. ఇందులో సభ్యులు చెల్లించిన మూలధనం 630.3 కోట్ల రూపాయలు కాగా కేంద్ర పభుత్వం ఎఫ్ పి ఓ లకు వ్యాపార నిమిత్తం తన వంతుగా 210.1 కోట్ల రూపాయలు మ్యాచింగ్ నిధులు పంపిణీ చేసింది.

ఎఫ్ పి ఓలకు తమ సభ్య రైతుల మార్కెటింగ్ అవసరాలు తీర్చుటకు ఒక్కొక్క సంస్థకు 75 శాతం సబ్సిడి క్రింద కూరగాయల సేకరణ కేంద్రాల ఏర్పాటు కోసం ఉద్యాన శాఖ నుండి నిధులు పొందే అవకాశం వున్నది. ఇప్పటికే కొన్ని సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాయి. కాని, ఇంకా అనేక సంస్థలు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోలేక పోతున్నాయి.

ఆత్మ విశ్వాసమే మనకు అసలైన తోడు, నీడ, బలం ,ధైర్యం ; సమస్యలను ఎదుర్కొనే సత్తా ఇచ్చేది అదే



**ఆటంకాలు:** ఎఫ్ పిఓ ల గమనాన్ని పరిశీలిస్తే, వాటి గమ్యం చేరుకోవడంలో అవి అనేక అడ్డంకులను ఎదుర్కుంటు న్నాయని చెప్పవచ్చు. ఆ అడ్డంకులలో కొన్ని ముఖ్యమైన వాటిని చూద్దాం.

**1. నిర్వహణ వ్యయాలు:** ఎఫ్‌పిఓ ల నిర్వహణ కొరకు ప్రారంభం నుండి మూడు సంవత్సరముల వరకు ప్రభుత్వం నిధులను కేటాయిస్తు౦న్నది. అనగా మూడు సంవత్సరముల తరువాత ప్రతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ కూడా తమ నిర్వహణ కొరకు కావలసిన నిధులను తామే స్వయంగా సమకూర్చుకోవాలి. అలా జరగాలంటే ప్రారంభం నుండి ఒక సమర్థవంతమైన వ్యాపార ప్రణాళికను రూపొందించు కొని దానిని అమలు చేయాలి. ప్రతి సంస్థకు కనీస నిర్వహణ నిధులు ప్రతినెల రూ.లు 40000 – 50000 అవసరం వున్నది. ఈ లాభాలను పొందాలంటే సంస్థలు ప్రతి నెల 8.0–10.0 లక్షల రూపాయలు వ్యాపారం చేయాలి. (మొత్తం అమ్మకాలలో 5%లాభం అని అంచనా వేయడం జరిగింది). కాని చాలా సంస్థలు ఈ వ్యాపారం చేయలేకపోతున్నవి.

**2. పాలకవర్గంలో యాజమాన్య భావన లోపం:** రైతు ఉత్పత్తిదారు సంస్థలలో పాలక వర్గం ఆసక్తి చూపి తమ సంస్థను అభివృద్ధి పయనంలో నడపాలన్న శ్రద్ధ తక్కువగా ఉండుట / లేకపోవడం. స్వచ్ఛంద సంస్థల సిబ్బంది ఎన్ని పర్యాయాలు చెప్పినప్పటికిని స్పందించక పోవడం.

**3. ప్రోత్సాహ సంస్థలమధ్య ఏకాభిప్రాయ లోపం:** స్వచ్ఛంద సంస్థలు. ప్రభుత్వ విభాగాలు మొదలగు వాటి ద్వారా రైతు ఉత్పత్తిదారు సంస్థలు ఏర్పాటు చేయడం జరుగు చున్నది. ఈ సంస్థలను బలోపేతం చేయుటలో ప్రోత్సాహక సంస్థల అధికారుల పాత్ర చాలా కీలకమైనది. అయితే ప్రోత్సాహక సంస్థల ఉన్నత అధికారుల ఆలోచనలు క్రింది స్థాయి వరకు చేరకపోవడం. క్రింది స్థాయి అధికారులు పై స్థాయి వారికి ఖచ్చితమైన సమాచారం ఇవ్వకపోవడం. క్రింది స్థాయి అధికారులపై ఉన్నత అధికారులు ఆధార పడడం వలన ఆశయ సాధనలో వెనుక బడుచున్నారు.

**4. క్షేత్ర స్థాయి సిబ్బందిలో ప్రమాణాలు లేకపోవడం:** ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ క్షేత్రస్థాయి నిర్వహణలో సి.ఈ.ఓ కీలక పాత్ర పోషిస్తారు. తరచూ వారు నిలిచి పోవడం, కొత్తవారిని ఎంపిక చేసి వారికి పని నేర్పించే లోపు వారు నిలిచిపోవడం వలన సంస్థల బలోపేతం చేయడానికి కావాల్సిన ప్రమాణాలు క్షేత్ర స్థాయి సిబ్బందిలో కొరవడుచున్నవి.

**5. సంస్థల కార్యాలయాలు వ్యాపార కేంద్రాలు అందరికి అందుబాటులో లేకపోవుట :** రైతు ఉత్పత్తిదారు సంస్థ రోజువారీ కార్యక్రమాల కొరకు కార్యాలయాలు మరియు సభ్యులకు వివిధ రకాల మార్కెటింగ్ సేవలు అందిం చుట కొరకు దుకాణాలు నిర్వహిస్తున్నారు.. ఈ దుకాణాలు సభ్య రైతులందరికీ అందుబాటులో లేకపోవడం వల్ల కూడా తక్కువ వ్యాపారం జరగడానికి అవకాశం ఏర్పడింది.

**6. సిబ్బందిలో సంకుచిత భావం:** ప్రభుత్వ ఆశయ సాధన దిశగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలను నిర్వహించడం లో వివిధ స్థాయిలలో వున్న సిబ్బందికి సరైన అవగాహన, దీర్ఘకాలిక దృష్టి లేకపోవడం. సంస్థల ఏర్పాటు దశ నుండి సుస్థిర దశ వరకు సిబ్బంది ఆసక్తితో ఆలోచించి, శాశ్వత ఫలితాలపై ప్రతి అడుగు వేయాలి. కాని ఆచరణలో స్వల్ప కాలిక ఫలితాలపై దృష్టితో ముందుకు సాగుట వలన సంస్థల బలోపేతంలో వెనుక బడుతున్నవి.

**7. టార్గెట్:** “పునాదులు గట్టిగా వుంటేనే ఇల్లు కొన్ని సంవత్సరాల పాటు నిలబడుతుందని” పెద్దల సామెత. ఆచరణలో ఈ సామెత కూడా నిజమే అని నిరూపితమైంది. అయితే తక్కువ సమయంలో ఎక్కువ సంస్థలను ఏర్పాటు చేయాలని, ఎక్కువమంది రైతులను రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో చేర్చాలన్న కృత నిశ్చయంతో అటు ప్రభుత్వం,

స్నేహం పిలవకున్నా వస్తుంది , అయితే స్నేహాన్ని పంచే వారితోనే అది నిలుస్తుంది !

ఇటు స్వచ్ఛంద సంస్థలు పని చేయడం వలన ఎఫ్ పి ఓల ఏర్పాటులో ప్రమాణాలు పాటించడం లేదు.

**ముందున్న కర్తవ్యం**

- అటు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు దీర్ఘకాలిక ఫలితాల కోసం ప్రణాళికలు రూపొందించాలి. ఈ ప్రణాళికలు కూడా ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వుండాలి. ప్రతి గ్రామానికి స్థానిక పరిస్థితులు వేరుగా వుంటాయి.
- ప్రోత్సాహక సంస్థలో కొత్తగా వచ్చే సిబ్బంది అప్పటి వరకు ఏమి జరిగిందనే దానిపై అవగాహన పెంచుకొని ముందుకు సాగాలి.
- రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో దగ్గరగా పనిచేసే సిబ్బంది వెనుకబడినపుడు, పర్యవేక్షణ అధికారులు సున్నితత్వంతో సహకరించాలి. ఒక్కోసారి పర్యవేక్షణ అధికారుల వలన మేలుకన్నా నష్టం ఎక్కువగా జరిగే ప్రమాదం వున్నది.
- ప్రోత్సాహక సంస్థలు తమ ఎఫ్‌పిఓల లక్ష్యాలకనుగుణంగా రైతు ఉత్పత్తిదారు సంస్థలు పని చేస్తూ వుండాలని ఆశిస్తాయి. ఆ ఆలోచన మంచిదే అయినప్పటికిని వారు చేపట్టే కార్యక్రమాలు రైతు ఉత్పత్తిదారుల సంస్థ మనుగడకు ప్రమాదంగా మారకూడదు.
- రైతు ఉత్పత్తిదారుల సంస్థల సిబ్బందితో తరచుగా సమావేశాలు నిర్వహిస్తూ ఉత్తమ సేవలు అందించే సంస్థల కార్యక్రమాలను ఇతరులతో పంచుకుంటూ, ఎక్కడైనా సమస్య ఉత్పన్నం అయితే కలసికట్టుగా పరిష్కరిస్తూ ముందుకు సాగాలి.
- సభ్యులను చేర్చుకోవడం, పాలకవర్గ ఎంపికలోను కొన్ని నిర్దిష్ట ప్రమాణాలు పాటిస్తూ, రైతు ఉత్పత్తిదారు సంస్థల ఏర్పాటులో టార్గెట్‌తోపాటు ప్రాసెస్ కూడా పాటించాలి.

పైన తెలిపిన వివిధ అడ్డంకులు వున్నప్పటికినీ, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు సభ్య రైతులకు అనేక సేవలు అందిస్తూ ప్రగతి పయనంలో ముదుకు సాగుతుండడం అభినందించ వలసిన విషయం. ■

## ఇంట్లో చీమల బెడదను నివారించే చిట్కాలు

ఇళ్లల్లో చీమలతో పెద్ద సమస్యగానే ఉంటుంది. చీమలను రసాయనాలను ఉపయోగించి చంపేందుకు ప్రయత్నిస్తూ ంటారు. కానీ ఇలా చేయడం వల్ల శ్వాస ఇబ్బంది కలుగుతుంది. కనుక సహజ పద్ధతుల్లోనే ఈ సమస్యను తరిమికొట్టాలి.

**వేప నూనె**

వేప గింజల నుంచి తీసే వేప నూనె సహజమైన పురుగుల నివారిణిగా ఉపయోగపడుతుంది. వేప నూనెను స్ప్రే చేస్తే ఆ వాసనకు చీమలు తగ్గుతాయి.

**మిరియాల పొడి, కారం**

నల్ల మిరియాల పొడి, ఎఱ్ఱ కారం ఇవి రెండింటిలోనూ ఘాటైన వాసన ఉంటుంది. వంటగది మూలల్లో చల్లడం వల్ల బాగా పనిచేస్తుంది.

**పెప్పర్ మింట్**

పెప్పర్ మింట్ నీటిని చల్లడం వల్ల చీమలు రావు. ఇంట్లో పుదీనా మొక్కను పెంచుకోవడం వల్ల చీమలు, దోమలు, పురుగుల్లాంటివి అటువైపు రావడం తగ్గుతాయి.

**యూకలిప్టస్ ఆయిల్**

లెమన్, యూకలిప్టస్ ఆయిల్ కలిపి చిలకరించినా చీమలు తగ్గుతాయి. నూనె చీమల బెడదను తగ్గించడంలో పనిచేస్తుంది.

**ఉప్పు**

ఉప్పు కూడా చీమల బెడదను తగ్గిస్తుంది. చీమలు ఉన్న ప్రదేశంలో ఉప్పును చల్లడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

**దాల్చిన చెక్క**

చీమలను వదిలించుకోవడానికి చక్కగా పనిచేస్తుంది. దాల్చిన చెక్క, లవంగం కలిపి చీమలు వచ్చే చోట ఉంచాలి. దీనివల్ల చీమల విషయంలో తగ్గే అవకాశం ఉంటుంది. ■


**చరిత్ర సృష్టించిన వారంటే ఓడిపోని వారనికాదు, ఓటమితో ఆగక గెలుపు అంతు చూసిన వాళ్ళు**

# కుటుంబానికి ఏడెకరాలకు 'రైతు భరోసా' !

**రా**ష్ట్రంలోని రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని తీసుకు వచ్చింది. రైతు భరోసా పథకాన్ని ఏడెకరాల వరకు పరిమితి విధించింది. అయితే అదాయపు పన్ను చెల్లించే వారు, ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ప్రజా ప్రతినిధులకు.. ఈ పథకం వర్తించకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకోసం రైతు భరోసా మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది.

ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం తరహాలో.. ఈ పథకాన్ని సైతం అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయిస్తున్నట్లు సమాచారం.

అందులో భాగంగా కుటుంబంలో ఎంతమంది పేరిట భూమి ఉన్నా.. అందరిని ఒకే లెక్క కట్టి కుటుంబాన్ని ఓ




యూనిట్‌గా తీసుకొని గరిష్టంగా ఏడెకరాల వరకే రైతుబంధు పరిమితం చేసి... అంతవరకే రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అందుకోసం ప్రభుత్వం ప్రణాళికలను సైతం సిద్ధం చేస్తోంది.

రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం ఎకరానికి రూ. 5 వేల చొప్పున సాగుకు పెట్టుబడి సాయం అందిస్తుంది. రెండు పంటలకు కలిపి.. ఖరీఫ్, రబీ సీజన్‌లకు ఎకరానికి రూ. 5000 చొప్పున రెండు సీజన్లకు కలిపి రూ. 10,000 పెట్టుబడిగా ఇవ్వనుంది. ఈ మొత్తాన్ని రైతులకు చెక్కుల రూపంలో ఇస్తున్నారు

అర్హులైన రైతులకు మాత్రమే ఈ పథకం ద్వారా సాయం అందించాలనే లక్ష్యంతో.. సాగు భూములకు సంబంధించిన సమగ్ర నివేదికలను జిల్లా అధికారుల నుంచి సేకరించాలని ఆదేశించింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకంలో నగదును .. పోడిగింపు భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, రోడ్ల రూపంలో దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

**వారికి ఈ పథకం వర్తించదు..**

ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం సాగు భూములకు మాత్రమే వర్తింప చేయాలని నిర్ణయించింది. ఆ క్రమంలో బీడు భూములు, కొండ ప్రాంతాలు, ఫామ్‌హౌస్‌లు ఈ పథకానికి అనర్హమని ప్రకటించింది. ఇక సాగు భూములు ఖచ్చితం గా గుర్తించేందుకు శాటిలైట్ ఇన్ఫర్మేషన్ వినియోగంపై సైతం ప్రభుత్వం దృష్టి సారించింది. దీంతో సర్వే నెంబర్ల ఆధారంగా భూమి హక్కుదారుల వివరాలను గుర్తిస్తోంది. దాంతో ప్రస్తుత డేటా ప్రకారం.... రాష్ట్రం లోని 13 శాతం రైతుల వద్దే 10 ఎకరాలకు పైగా భూములున్నట్లు గుర్తించింది. 10 ఎకరాల పరిమితి వరకు రైతు భరోసా పథకం లబ్ధిపై అందించాలనే ప్రతిపాదనపై ప్రభుత్వం గతంలో చర్చించింది. కానీ 7 ఏకరాలు వరకు ఉన్న రైతులకు ఈ రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. ■

ఇద్దరి మధ్య వివాదంలో తేల్చవలసింది ఎవరి వాదన బలంగా వుందని కాదు, ఎవరి మాట నిజం అని

# మహిళా స్వయంసహాయ సంఘాలకు 'సౌరశక్తి'

తెలంగాణాలోని మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వారికి సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క ఆదేశాల మేరకు... అధికారులు ప్రతిపాదనలు రూపొందించగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.

రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వారికి సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క ఆదేశాల మేరకు... అధికారులు ప్రతిపాదనలు రూపొందించగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.



ఒక్కో స్వయం సహాయక సంఘానికి ఒక మెగావాట్ చొప్పున మొత్తం 4,000 ప్లాంట్లను కేటాయిస్తారు. వీటి స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వమే భూమిని సమకూర్చి, రుణ సదుపాయమూ కల్పించనుంది. ఇప్పటికే మహిళాశక్తి పథకం కింద పట్టణాల్లో క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. 17రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. మహిళా సంఘాలతో బస్సులను కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడానికి కసరత్తు చేస్తున్నారు. తాజాగా సౌర విద్యుత్తు ప్లాంట్లను స్థాపింపజేయాలని నిర్ణయించారు.

**ప్లాంట్‌పై ఏడాదికి రూ.30 లక్షల రాబడి**

పంచాయతీ అధికారుల నివేదిక ప్రకారం... ఒక మెగావాట్ సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తే ఏడాదికి రూ.30 లక్షల ఆదాయం వస్తుందని అంచనా. ఇలాంటి ఒక ప్లాంట్ ఏర్పాటుకు రూ.3 కోట్ల వ్యయం అవుతుంది. ఇందులో 10% సమాఖ్యలకు అనువైన భూములను గుర్తించి, లీజుపై ఇప్పిస్తారు. ఇంధన శాఖ అనుమతులు లభించిన వారం రోజుల వ్యవధిలోనే ప్లాంట్ల ఏర్పాటును పూర్తి చేస్తారు.

'మహిళా సంఘాలకు సౌర విద్యుత్తు ప్లాంట్ల కేటాయింపు విప్లవాత్మక నిర్ణయం. దీనిద్వారా గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం. ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన భూమిని సేకరించాలి. బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి రుణాలను ఇప్పించాలి. పథకం వివరాలను ఇటీవల బ్యాంకర్ల సమావేశంలో ప్రస్తావించాం. రుణాల రీపేమెంట్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులు 99% ప్రగతిని కనబరుస్తున్నాయి. అందుకే వారికి రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు ఆసక్తిగా ఉన్నారు' అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

**ఉచితంగా యూనిఫాం చీరలు**

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా.. స్వయం సహాయ మహిళా సంఘాల సభ్యులకు యూనిఫాం చీరలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రంలోని 63 లక్షల మంది మహిళా సంఘ సభ్యులకు ఉచితంగా యూనిఫాం చీరలు ఇవ్వాలని నిశ్చయించింది. ఈ యూనిఫాం చీరల కోసం ప్రత్యేకంగా డిజైన్ల కూడా ప్రభుత్వం రూపొందించింది.

మహిళా సమాఖ్య సంఘాల కోసం తయారు చేసిన యూనిఫాం చీరలను సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ మంత్రి సీతక్కకు చూపించారు. ప్రత్యేకంగా తయారు చేసిన చీరలను పరిశీలించిన సీతక్క.. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో యూనిఫాం చీరల డిజైన్లను ఖరారు చేయనున్నారు. చీరల డిజైన్లు ఖరారు చేసిన తర్వాత 63 లక్షల మంది

మహిళా సంఘ సభ్యులకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్టు మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మహిళా సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తు న్నాయి. కాగా శ్రీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల ఆర్థికాభి వృద్ధి కోసం తెలంగాణ మహిళాశక్తి పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. స్వయంసహాయ మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం వచ్చే ఐదేళ్లలో మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను అందించనున్నట్టు పలుమార్లు ప్రకటించింది.

**మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు**

తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్సీ) 'ఇందిరమ్మ మహిళా పథకం' కింద మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. కుట్టుపనిలో శిక్షణ పొందిన ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైనులు, పార్సీ మతాలకు చెందిన మహిళలు ఈ పథకానికి అర్హులు.

దరఖాస్తులను డిసెంబర్ 16 నుంచి డిసెంబర్ 31 మధ్య స్వీకరిస్తారు. టీ జీ ఎం ఎఫ్ సి వెబ్‌సైట్ ద్వారా అప్లై చేసుకోవచ్చు. అభ్యర్థులు దరఖాస్తు ఫామ్ కాపీని, ఇతర అవసరమైన పత్రాలను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారికి సమర్పించాలి. అప్పుడే మీరు ఈ స్కీమ్ కింద ఉచిత కుట్టుమిషన్ పొందటానికి అర్హత సాధిస్తారు.

18 నుండి 55 సంవత్సరాల వయస్సు గల మహిళలు ఈ పథకానికి అర్హులు. అభ్యర్థులు తప్పనిసరిగా నిరుద్యోగులు అయి ఉండాలి. లేదా గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల రూపాయల కంటే తక్కువ వార్షిక ఆదాయం కలిగి ఉండాలి.

దరఖాస్తుదారులు వయస్సు నిర్ధారణ, చిరునామా ధృవీకరణ డాక్యుమెంట్లను అందించాలి. కనీసం 5వ తరగతి పూర్తి చేసి ఉండాలి. అదనంగా వారు టైలరింగ్ నైపుణ్యాలను కలిగి ఉండాలి. లేదా టీజీఎంఎఫ్సీకి అనుబంధంగా ఉన్న సంస్థల నుండి శిక్షణ పొంది ఉండాలి. ■

## ఇక పురుషులకు ప్రత్యేకంగా స్వయంసహాయ సంఘాలు

మహిళలకు ప్రభుత్వం పలు రకాల చేయూత కార్య క్రమాలు అందుబాటులోకి తెచ్చింది. వీటిల్లో స్వయం సహాయ (డ్వాక్రా) సంఘాలు కూడా ఒక కీలక భాగమనే చెప్పుకోవచ్చు. దీనివల్ల చాలామంది మహిళలు ఊరట పొందుతున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. స్వయం సహాయక సంఘాలు సక్సెస్‌ఫుల్ ఫార్ములాగా మారాయి. ఇప్పుడు వీటి మార్గంలోనే పురుషులకు కూడా పొదుపు సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు చర్యలు కూడా తీసుకుంటోంది.

అనకాపల్లిలో తొలిగా 28 గ్రూపులను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే 20 గ్రూపులను కూడా గుర్తించారు. దీనివల్ల చాలామందికి ఊరట లభించ నుందని చెప్పుకోవచ్చు. సులభంగా రుణాలు పొందొచ్చు. డ్వాక్రా సంఘాల్లో పది మంది మహిళలు ఒక జట్టుగా ఉంటారు. అయితే ఈ కొత్త పురుషుల డ్వాక్రా గ్రూపుల్లో ఐదు మంది మాత్రమే ఉంటారు. అంటే ఒక్కో గ్రూప్‌లో ఐదుగురు మాత్రమే ఉంటే సరిపోతుంది.

మగవారితో ఏర్పాటు చేసే ఈ పొదుపు సంఘాలకు రూ. 75 వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణాలు జారీ చేస్తారు. తీసుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లిస్తే.. తర్వాత రుణ పరిమితిని పెంచి.. ఇంకా ఎక్కువ డబ్బులు రుణం రూపంలో పొందొచ్చు. 18 ఏళ్లు దాటిన పురుషులు ఈ పొదుపు సంఘాల్లో చేరొచ్చు. గరిష్ట వయసు పరిమితి 60 ఏళ్లు. పురుషుల కామన్ ఇంట్రస్ట్ గ్రూప్ అని వీటికి పేరు పెట్టారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు వంటివి అవసరం అవుతాయి.

మీరు కూడా ఇలా గ్రూప్‌ల చేరాలని భావిస్తే.. వెంటనే అప్లై చేసుకోవచ్చు. జీవీఎంసీ జోనల్ ఆఫీస్‌కు వెళ్లాలి. అక్కడ యూసీడీ విభాగంలో దరఖాస్తు అప్లికేషన్ ఇవ్వొచ్చు. గ్రూప్‌లో జాయిన్ కావొచ్చు. ఆర్థిక చేయూత పొందవచ్చు. ■

# ఆంధ్రప్రదేశ్‌లో రైతుల రుణాల రీషెడ్యూల్

**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది.. ఈ మేరకు కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 10 జిల్లాలను వర్షాలు, వరదలు ముంచెత్తగా.. అక్కడ రైతుల రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. అల్లూరి సీతారామరాజు, విజయనగరం, కాకినాడ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, జిల్లాల్లో.. ఈ ఏడాది ఆగస్టు 30తర్వాత వరద ముంపునకు గురైన ప్రాంతాల రైతులకు రుణాలు రీ షెడ్యూల్ చేస్తారు. ఈ మేరకు ఆ జిల్లాల్లో రైతులకు రూ.50 వేల లోపు రుణాలపై స్టాంప్ డ్యూటీ, యూజర్ ఛార్జీలు మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం నిర్ణయించింది. ఈ మేరకు కొత్త రుణాలు తీసుకునేందుకు చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీకీ మినహాయించగా.. ఈ ఉత్తర్వులు 2025 మార్చి 31 వరకు అమలు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుంచి ఆంధ్రప్రదేశ్ ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.1000 కోట్ల అదనపు రుణం పొందేందుకు ప్రభుత్వ హామీ పొడిగిస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఈ రుణాన్ని ఈ ఏడాది వరి సేకరణ కార్యకలాపాల కోసం తీసుకోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేసిన ఆరేడు గంటల్లోనే కొంతమంది రైతులకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోంది.. అయితే రైతులు పంపిన ధాన్యాన్ని రైస్‌మిల్లులో దిగుమతి చేసిన వెంటనే సంబంధిత రశీదు జనరేట్ చేయగానే.. అక్కడికక్కడే డబ్బుల్ని చెల్లించే (ఇన్‌స్టంట్ పేమెంట్) అంశాన్ని కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు చేశారు.

గత ప్రభుత్వ హయాంలో రీసర్వే చేసిన 6,688 గ్రామాల్లో సబ్ డివిజన్ కోసం 48,899 అర్జీలు రాగా.. ఒక్కో సబ్ డివిజన్ చేసేందుకు చెల్లించాల్సిన రూ.550 ఫీజును మినహాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా గ్రామకంఠం భూముల సర్వే, రికార్డింగ్ కోసం 679 సూపర్ న్యూమరీ డిప్యూటీ తహశీల్దార్ (రీ–సర్వే) పోస్టుల్ని తీసుకొచ్చారు. రెండేళ్లపాటు (2026 సెప్టెంబరు 22 వరకు) కొనసాగించేందుకు కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. కొన్ని షరతులతో రీ సర్వే ప్రాజెక్ట్ కింద మిగిలిన 10,128 గ్రామాల్లో రీసర్వే చేయాలన్న ప్రతిపాదనకు కూడా మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు చిత్తూరు జిల్లాలో నూతన కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు 50.21 ఎకరాల్ని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీకి ఉచితంగా బదలాయించాలని నిర్ణయించారు.

**('సమయం' సౌజన్యంతో)**

## రైతులకు తాకట్టు లేకుండా రూ. 2 లక్షల రుణం!

**వ్య**వసాయ అవసరాలకు, పంట సాగు కోసం ఎలాంటి తాకట్టు లేకుండా అందించే రుణ సదుపాయాన్ని పెంచుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రైతులు ఎలాంటి తనఖా లేకుండా రూ.1.6 లక్షల వరకు రుణం తీసుకునే వెసులుబాటు ఉండగా.. ఇటీవల దాన్ని రూ.2 లక్షలకు పెంచింది. 2025 జనవరి 1 నుంచి ఈ నిబంధన అమల్లోకి వస్తుందని తాజాగా స్పష్టం చేసింది.

పంటల సాగుకు రైతులు పెడుతున్న ఖర్చులను, ద్రవ్యోల్బణం పెరుగుదలను పరిశీలిస్తూ ఆర్‌బీఐ ఈ పరిమితిని పెంచుతూ వస్తోంది. 2004లో కేవలం రూ.10 వేలే ఉండగా, క్రమంగా దాన్ని పెంచుతూ వచ్చింది. తాజాగా దీన్ని రూ.2 లక్షలకు పెంచింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. సాధారణంగా భూ యజమానుల నుంచి ఎలాంటి పూచీకత్తు అడగకుండా బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలి. అయితే క్షేత్రస్థాయిలో ఇది అమలుకావడం లేదు.

# సాగునీటి సంఘాలకు సమస్యల సవాల్



**కృ**ష్ణా వెస్టర్న్ డెల్టా (కేడబ్ల్యుడీ) పరిధిలోని ఆయకట్టులో సాగుదారుల పరిస్థితి సంకటంగా మారింది. సాగునీరు సక్రమంగా విడుదల కాకపోవడం అందుకు కారణం.

ఆయా సమస్యల పరిష్కారానికి సాగునీటి సంఘాల ప్రతినిధులు బాధ్యత వహించాల్సి ఉంది. తాజాగా ఎన్నికైన సాగునీటి సంఘాల బాధ్యులు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తెరిగి అడుగులు వేయాలని ఆయకట్టులోని రైతులు సూచిస్తున్నారు. లేదంటే సాగునీటి సంఘాల బాధ్యులతో తమకెలాంటి ప్రయోజనం ఉండదని చెప్తున్నారు.

సాగునీటి సంఘాల ప్రతినిధులకు క్షేత్ర స్థాయిలో సమస్యలు సవాల్‌గా మారుతున్నాయి. పలుచోట్ల కాలువల్లో పూడికతీతలు జరగలేదు. దీంతోపాటు పటుచోట్ల కాలువల్లో నాచు, తుంగ, గడ్డి ఏపుగా పెరిగి నీటి పారుదలకు ఆటంకం కలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా సాగునీటి సంఘాల బాధ్యులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఆయకట్టు పరిధిలోని, దిగువ ప్రాంతంలోని మాగాణి సాగుకు అందాల్సిన సాగునీరు సక్రమంగా అందాలంటే కాలువలు సక్రమంగా ఉండాలి. కాలువలో సాగునీరు సక్రమంగా పారుదల ఉన్నపుడే ఆయకట్టులోని భూములకు నీరు సక్రమంగా అందేది. అందుకు అనుగుణంగా సాగునీరు పారుదలకు కాలువలు సక్రమంగా లేవు.

ఇక ఆయకట్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాల పరిధిలో సాగునీరు పారుదలకు సంబంధించిన కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి మరమ్మతులు నామ్‌కే వాస్తేగా జరిగాయి. అయితే సాగునీరు సక్రమంగా పారుదల జరిగే విధంగా చేపట్టాల్సిన చర్యలపై ప్రస్తుతం నీటి సంఘాల బాధ్యులుగా ఎన్నికైన వారిపై ఉంది. అందుకు అనుగుణంగా వారు అడుగులు వేయాలి. లేదంటే సాగునీటి సంఘాల ద్వారా తమకు ఒనగూరేదేమీ లేదని ఆయకట్టు రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను కాపాడే దిశగా సాగునీటి సంఘాల బాధ్యులు తగిన అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. ■

---

దీంతో ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక వడ్డీతో రుణం తీసుకొని అప్పులపాలవుతున్నారు. అలాంటివారికి అండగా ఉండేందుకు రిజర్వ్ బ్యాంక్ ఈ సదుపాయం కల్పిస్తోంది.

వ్యవసాయ పెట్టుబడుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు రుణ సదుపాయాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వ్యవసాయ మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ చర్య ద్వారా చిన్న, సన్నకారు రైతులైన 86 శాతం మందికి ప్రయోజనం చేకూరనుందని పేర్కొంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను వేగంగా అమలు చేయాలని, కొత్త రుణ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించాలని బ్యాంకులకు సూచించింది. వ్యవసాయ రంగంలో రైతుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు, వారికి అవసరమైన ఆర్థిక సౌలభ్యాన్ని అందించేందుకు ఇదొక వ్యూహాత్మక చర్యగా అభివర్ణించింది. ■

**పొరపాటు చేశావా? ఒప్పుకో, ఫలితమెలా వుంటుందో తెలుసుకో, మళ్లీ ఆ పొరపాటు చేయకు**

# జానపద నర్తనంతో... జాతీయ 'ప్రకాశం' !

**రా**మాయణంలో సాక్షాత్తు ఆంజనేయ స్వామి కూడా తన శక్తి ఏమిటో తనకే తెలియనట్టు నిర్లిప్తంగా వుండిపోతాడు. కాని, జాంబవంతుడు ప్రోత్సహించి, 'నీకెంతో శక్తి వుంది, ఈ కార్యాన్ని నీవు సాధించగలవు' అని ప్రోత్సహిస్తే , ఆత్మ విశ్వాసం కలిగిస్తే అలవోకగా నూరుయోజనాల సముద్రాన్ని లంఘించి, సీతామాతను కనుగొని అద్భుతాన్ని సాధించాడు. ప్రోత్సాహం అందించే ఫలితం అదీ ! ప్రతిభకు తగిన ప్రోత్సాహం తోడైతే మళ్ళీ మళ్ళీ అలాంటి అద్భుతాలే ఆవిష్కృతమవుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కంభం మండలంలోని యర్రబాలెం అనే ఒక చిన్న

*__వి__ద్యార్థినులు పిక్కిలి లక్ష్మి, పిక్కిలి పావని, శివపార్వతి, నల్లబోతుల మాధవి జిల్లా, రాష్ట్రస్థాయి జానపద నృత్య పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.*




*సంగీత ఉపాధ్యాయుడు శ్రీ ఖాసింతో చిన్నారి కళాకారిణులు*

గ్రామం పేరు జాతీయ స్థాయికి చేరేలా చేసింది యిదే ప్రోత్సాహం.

ఆ గ్రామ ఉన్నత పాఠశాలలో దాదాపు 170 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.వారిలో ఎందరిలో ఏ రకమైన ఎన్ని ప్రతిభాపాటవాలు నిద్రాణంగా వున్నాయో తెలియదు కాని, 8-10 మంది విద్యార్థినులు తమలో నాట్యకళా కౌశలం దాగివుందని నిరూపించడానికి సమయంకోసం ఎదురుచూస్తున్నారు. ఒక ఉపాధ్యాయుడు వారికి కొద్దిపాటి నాట్య శిక్షణ యిచ్చారు. అప్పుడు ఆ పాఠశాలకు రెండేళ్ళ క్రితం శ్రీ ఎం. ఖాసిం అనే సంగీత ఉపాధ్యాయుడు వచ్చారు. కేవలం సంగీతమే కాక ఆయనకు నాట్యంలో కూడా అభిరుచి, ఆసక్తి వున్నాయి.వాటిని రంగరించి ఆయన ఉత్సాహవంతులైన విద్యార్థులను కూడగట్టి, నృత్యంలో చక్కటి శిక్షణ యిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీ లక్ష్మయ్య ఆయనకు బాసటగా నిలిచారు. చిన్నారుల ఆసక్తిని గమనించిన తల్లి దండ్రులు వారిని ప్రోత్సహిస్తుండటంతో జానపద నృత్య ప్రదర్శనలో భళా అనిపించుకుంటున్నారు. సెలవులు, విశ్రాంతి అనేవికూడా మరచి తదేకంగా శ్రీ ఖాసిం యిచ్చిన శిక్షణ ఫలించింది. ఎర్రబాలెం ఉన్నత పాఠశాలకు వరుసగా ప్రశంసలు, పురస్కారాలు రావడం మొదలై జిల్లా, రాష్ట్ర స్థాయి దాటి జాతీయస్థాయికి ఎర్రబాలెం గ్రామం తన ఖ్యాతిని విస్తరించింది.

విద్యార్థినులు పిక్కిలి లక్ష్మి, పిక్కిలి పావని, శివపార్వతి, నల్లబోతుల మాధవి జిల్లా, రాష్ట్రస్థాయి జానపద నృత్య పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. 2024 డిసెంబర్ 6న మైనంపాడులోని విద్యా శిక్షణ కేంద్రంలో జరిగిన కళా ఉత్సవ్ పోటీల్లోనూ ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్ 9, 10 తేదీల్లో విజయవాడ మురళీ రిసార్ట్‌లో జరిగిన రాష్ట్రస్థాయి 'కళా ఉత్సవ్' పోటీల్లో యర్రబాలెం విద్యార్థినులు సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. 2025 జనవరిలో మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు.

అంతకు ముందు గతేడాది సెప్టెంబర్ నెలలో జిల్లాస్థాయిలో జరిగిన జానపద నృత్యంలో ద్వితీయ బహుమతి సాధించారు. స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో

**ఓడినా మళ్ళీ గెలవ వచ్చు, కానీ సాకులు వెదకడం మొదలెట్టావా ఇక శాశ్వత ఓటమే**

జిల్లా స్థాయిలో మైనంపాడులో జరిగిన నేషనల్ రోల్ ప్లేలో పాఠశాల విద్యార్థినులు ప్రథమ బహుమతి సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కన్సోలేషన్ బహుమతి సాధించారు. స్టైల్ డాన్స్ అకాడమి ఆధ్వర్యంలో మార్కాపురంలో జరిగిన డివిజనల్ స్థాయి జానపద నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. ప్రపంచ బాలల దినోత్సవాన్ని పురస్కరించు కొని విల్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జానపద నృత్య పోటీల్లోనూ మొదటి బహుమతి దక్కించుకున్నారు.

**అభినందన మందారాలు!**

తమ గ్రామానికి యింతటి ఖ్యాతి తీసుకువచ్చిన విద్యార్థులను, ఉపాధ్యాయులను పలువురు అభినందనలతో ముంచెత్తారు. డిసెంబర్ 18వ తేదీన ఆ గ్రామ పూర్వ నివాసులైన శ్రీ జె వి క్రిష్ణమూర్తి, శ్రీమతి విజయలక్ష్మి దంపతులు, మార్కాపురానికి చెందిన ప్రముఖ న్యాయవాది శ్రీ రాళ్ళభండి శ్రీకృష్ణయ్య, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ శ్రీ మిట్టపల్లి ప్రసాద్, కంభం ఎం పి పి దంపతులు శ్రీమతి



చేగిరెడ్డి తులశమ్మ, శ్రీ ఓబుల్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీమతి లక్ష్మీదేవి, గ్రామ సర్పంచ్ శ్రీ మద్దు శ్రీనివాస్ , పాఠశాల విద్యాకమిటి ఛైర్మన్ ప్రభృతులు పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో చిన్నారి నాట్య కళాకారిణులను మనసారా అభినందించి, బహుమతులతో, శాలువాలతో, జ్ఞాపికలతో వారిని సత్కరించి, తమ ఆనందాన్ని వారితో పంచుకున్నారు. ఈ అభినందన సమావేశంలో పాఠశాల సిబ్బందితోపాటు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొని విద్యార్థినులను అభినందించారు.

## షూటింగ్‌లో రెండు రజత పతకాలు

**ఢి**ల్లీలో ఈ నెల 21న జరిగిన జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో కొత్తపట్నం మండలం రంగాయపాలెం గ్రామ పంచాయతీ వలసపాలేనికి చెందిన ద్వారం ప్రణవి, గుంటూరు జిల్లాకు చెందిన ముకేష్ జోడీ రెండు రజత పతకాలు సొంతం చేసుకున్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగం సీనియర్, జూనియర్ కేటగిరీలో ప్రణవి, ముకేష్ జోడీ రెండో స్థానంలోనిలిచారు.



సీనియర్ విభాగంలో ప్రణవి –ముకేష్ ద్వయం 577 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది.

జూనియర్ విభాగంలో ఈ జోడీ 576 పాయింట్లతో రజితంలో మెరిసింది. ఇద్దరు కలిసి ఆంధ్రకు మంచి పేరు తెచ్చారు. ఇంతకు ముందు ప్రణవి అనేక స్వర్ణ పతకాలు సాధించింది. సీకే చౌదరి కోచ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రణవి తండ్రి ద్వారం జాలిరెడ్డి, డీవీ రెడ్డి అభినందించారు.

## ఫెన్సింగ్ పోటీలకు నలుగురు

**జా**తీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి. నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న వీరు ఈపీ, ఫాయిల్ విభాగాల్లో ప్రతిభ చాటారు.

*(మిగతా 29వ పేజీలో ...)*

**విజయం అంటే ఆశించిన దాన్ని సాధించడం కాదు, సాధించి తీరవలసినదాన్ని ఆశించడమే**

# ప్రకాశం డ్వామాలో అవకతవకలపై విచారణ

ప్రకాశంజిల్లా డ్వామా పూర్వ పీడీ శీనారెడ్డి అక్రమాలపై విచారణ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ అన్సారియా త్రిసభ్య కమిటీని నియమించారు. డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, జిల్లా ఆడిట్ అధికారి నారాయణరెడ్డి, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణలతో కూడిన కమిటీ కొద్దిరోజులుగా డ్వామాలో విచారణ చేస్తోంది. జిల్లాలో శీనారెడ్డి పీడీగా పనిచేసిన కాలంలో ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అవకతవకలపై దృష్టి సారించింది. సామాజిక తనిఖీలు, మండలాల్లో జరిగిన ప్రజావేదికలు, ఆ సందర్భం గా సోషల్ ఆడిట్ బృందాలు అవకతవకలు జరిగినట్లు గుర్తించిన మొత్తాలు, వాటిని ప్రజావేదికల్లో పీడీ హోదాలో పాల్గొన్న శీనారెడ్డి తగ్గించడం, అనంతరం ఆయా సిబ్బందిని వ్యక్తిగత విచారణ పేరుతో పిలిచి రికవరీలు లేకుండా చేయడం, తదితర అంశాలకు సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఫిర్యాదులు ఉన్న కనిగిరి, దోర్నాల, ముండ్లమూరు, కొండపి మండలాలకు సంబంధించిన ఫైళ్లపై విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, ఆ విభాగంలో కీలకమైన ఉద్యోగి సురేష్‌లను త్రిసభ్య కమిటీలోని అధికారులు పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ఇతర విభాగాల వారీ ఫైళ్లను పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆరోపణలు ఎదుర్కొం టున్న శీనారెడ్డిని వచ్చేనెల 2న విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చిన త్రిసభ్య కమిటీ ఆలోపు ఆయా ఫైళ్ల పరిశీలనతోపాటు ఫిర్యాదు చేసిన వ్యక్తులను కూడా విచారించాలని నిర్ణయించింది.

తదనుగుణంగా ప్రధాన ఫిర్యాదుదారునిగా ఉన్న పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌బాబును పిలిచి విచారించారు. ఈదర మోహన్ ఆమేరకు ఫిర్యాదులపై విచారణ నిర్వహిస్తున్న త్రిసభ్య కమిటీ ఎదుట పలు అంశాలపై వివరణ ఇచ్చారు.

ఆయన ప్రభుత్వ పెద్దలకు చేసిన ఫిర్యాదులలో కొన్నింటిపై వివరాలను అడిగారు. కాగా తాను పేర్కొన్న ఫిర్యాదులన్ని వాస్తవాలే అని సంబంధిత ఫైళ్ళను పరిశీలిస్తే స్పష్టంగా ఆ విషయం బయటపడుతుందని ఆ సందర్భంగా అధికారుల కమిటీకి మోహన్ చెప్పినట్లు సమాచారం. డ్వామాలో శీనారెడ్డి అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డాడని తద్వారా ప్రజాధనాన్ని భారీగా దోపిడీ చేశాడని మోహన్ త్రిసభ్య కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. తాను చేసిన ఫిర్యాదుపై అంశాల వారీగా వివరణలు ఇచ్చారు. ఆయన అధికారుల సూచనల మేరకు రాతపూర్వకంగా కూడా స్టేట్‌మెంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. డ్వామా పీడీగా పని చేసిన కాలంలో శీనారెడ్డి సంపాదించిన అవినీతి సొమ్ముతో కొనుగోలు చేసిన భూములు, భవనాలు ఇతరత్రా ఆస్తుల విషయంపై కూడా వారికి వివరాలు చెప్పినట్లు తెలిసింది. కాగా మరికొందరు ఫిర్యాదుదారులను కూడా పిలిచి విచారించాలన్న ఆలోచనలో త్రిసభ్య కమిటీ ఉన్నట్లు సమాచారం.

**డి సి సి బి పై సెక్షన్ 51 విచారణ**

ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో భారీగా అవి నీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. ఇందుకు సంబంధించి కలెక్టర్ అన్సారియా పంపిన నివేదిక ఆధారంగా సమగ్ర విచారణ చేపట్టాలని నిర్ణయించింది. సెక్షన్ 51 విచారణకు ఆదేశించింది. స్థానికంగా కలెక్టర్ పర్యవేక్షణలో ఒక అధికారిని నియమించి సెక్షన్ 51 విచారణ చేయించడం లేదా అవసరం అనుకుంటే రాష్ట్ర సహకార శాఖ నుంచి ఉన్నతాధికారిని నియమించడంపై నిర్ణయం తీసుకునే వెసులుబాటును కలెక్టర్‌కు కల్పించారు.

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో అవకతవకలపై తొలుత విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. అనంతర పరిణామాలతో విషయం సీఎం దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో కలెక్టర్‌కు ఉన్నతాధికారులు చేసిన

# వానాకాలంలో ఆరోగ్యకర ఆహారం

**వా**నలొచ్చాయంటే వాతావరణంలో చల్లదనమే కాదు.. ఇన్‌ఫెక్షన్లు కూడా వస్తాయి. జీర్ణసమస్యలు, దగ్గు, జలుబు ఈ సీజన్‌లో సులువుగా వస్తాయి. వానాకాలాన్ని ఎంజాయ్ చేయటమే కాదు.. హెల్తీ డైట్ కూడా అవసరం.

- ప్రొటీన్లు అధికంగా ఉండే నానబెట్టిన గింజల్ని తినాలి. బ్రేక్‌ఫాస్ట్ లేదా స్నాక్స్ సమయంలో వీటిని తీసుకుంటే వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.
- ఈ కాలంలో పసుపు గొప్ప ఔషధం. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండే ఈ పసుపు వల్ల అలర్జీలు, ఇన్‌ఫెక్షన్లు దరిచేరవు. అందుకే గోరువెచ్చని నీళ్లలోనో, పాలల్లోనో మంచి పసుపు కలిపి నిద్రపోయే ముందు తాగితే చక్కని ఫలితం ఉంటుంది.
- విటమిన్–సి ఎక్కువగా ఉండే నిమ్మరసం తీసుకోవటం మంచిదే. సాధారణంగా ఎండాకాలం నిమ్మరసాన్ని తాగుతారు. అలాగే మాన్‌సూన్‌లోనూ ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉండటానికి ఇది ఉపకరిస్తుంది.
- బాదం, పిస్తా, జీడిపప్పు లాంటి బలవర్ధకమైన నట్స్‌ను ఈ కాలంలో తినాలి. సులువుగా జీర్ణం అవ్వటంతో పాటు బలాన్ని, ఇమ్యూనిటీ పవర్‌ను ఇస్తాయవి.
- ఈ కాలంలో చిరుతిండ్లకు బంద్ చెప్పటం మంచిదే. వెజిటేబుల్ సూప్, చికెన్ సూప్‌లాంటివి తాగటం వల్ల ఉపశమనంతో పాటు ఆరోగ్యానికీ మంచిదే.
- హెర్బల్‌టీని ప్రిఫర్ చేయటం ఈ కాలంలో మరీ మంచిది.
- తాజా కూరగాయలతో పాటు తాజా పండ్లను తినాలి. దీనివల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్లు రావు.
- మెంతిపప్పు, మెంతికూర తింటే శరీరానికి బూస్టర్‌లా పని చేస్తుంది.
- కోడిగుడ్డుతో పాటు ఒమేగా ఫాటీ యాసిడ్స్ ఉండే చేపలను తినటం వల్ల ఆరోగ్యానికి మేలు చేకూరుతుంది.
- అల్లంటీ, వెల్లుల్లి వేసిన ఆహారం తినటం వల్ల గొంతు ఇన్‌ఫెక్షన్లు, కడుపులో సమస్యలు పోతాయి.
- అతిగా మసాలా ఉండే పదార్థాలు, ఎక్కువగా నాన్‌వెజ్ తినటం లాంటి ఈ కాలంలో మంచిది కాదు. దప్పిక తక్కువ ఉన్నా మంచి నీళ్లను బాగా తాగాలి. గోరువెచ్చని నీళ్లను తాగితే మరీ మంచిది.

వానాకాలంలో చర్మవ్యాధులు బారిన పడుతుంటారు. స్కిన్ ఎలర్జీలు, పగుళ్లు, దద్దుర్లు వస్తుంటాయి. ఇలాంటి

*(మిగతా 23వ పేజీలో ...)*

---

సూచనలతో త్రిసభ్య కమిటీతో విచారణ చేయించారు. అందులో పలు అంశాలు వాస్తవమని తేలింది. ఆ మేరకు పక్షం క్రితం విచారణ కమిటీ నివేదికను ప్రభుత్వానికి కలెక్టర్ పంపించారు. భారీగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని నిర్ధారణకు వచ్చినరాష్ట్ర ప్రభుత్వం. సెక్షన్ 51 విచారణకు అనుమతిస్తూ కలెక్టర్‌కు లేఖ పంపారు.

**చిత్తూరు డీసీసీబీలో అక్రమాలపై విచారణ**

చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ అధికారిగా నియమితులైన డీఆర్వో కె. మోహన్‌కుమార్ బ్యాంకు అధికారులతో పలు అంశాలపై చర్చించారు. డీసీసీబీలో రూ.కోట్లలో ఆర్థిక మోసాలపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై విచారణ జరపాలని ప్రభుత్వం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేసింది. 51 సహకార చట్టం మేర కలెక్టర్ విచారణకు ఆదేశిస్తూ విచారణ అధికారిగా డీఆర్వోను నియమించారు. బ్యాంకుకు విచ్చేసిన డీఆర్వో అక్కడి డీసీసీబీ సీఈవో మనోహర గౌడ్, డీసీఏవో బ్రహ్మానంద రెడ్డి, ఇతర అధికారులతో చర్చించారు.

■

నీ జీవితం సార్థకం కావాలంటే, బతికే ప్రతి రోజూ ఏదో ఒక మంచిపని చెయ్

# చిత్తూరు జిల్లాలో ఫలిస్తున్న ప్రకృతి వ్యవసాయం!

వ్యవసాయం అంటే ఇష్టపడే మురళి బీకాం పూర్తి కాగానే వ్యవసాయంపై దృష్టి సారించారు. ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేశారు. సోమల మండలం కరకమందకు చెందిన మురళి పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించేశారు. 10ఎకరాల్లో టమాట, చెరకు, దోస పంటలను విడతల వారీగా సాగు చేయడం మొదలెట్టారు. ప్రతి పంటకు విత్తన శుద్ధి కోసం బీజామృతం, పంట ఎదుగుదలతో పాటు పురుగుల నివారణకు ఘనజీవా మృతం, నీమాస్త్రం వంటి కషాయాలను తయారు చేసుకుని వినియోగించారు. తక్కువ వ్యయంతో పాటు అందుబాటులో లభ్యమయ్యే వస్తువులతో ఇవన్నీ తయారు చేసుకుంటున్నారు. పంటల నాణ్యత బాగుండడంతో మంచి ధరలు లభిస్తున్నాయి. ఏటా టమాటలోనే మురళి రూ.లక్షలు సంపాదిస్తున్నారు. కోలారు, వడ్డిపల్లె, పలమనేరు మార్కెట్లకు టమాటలను తరలించి మంచి ధర పొందుతున్నారు. సేంద్రియ ఉత్పత్తు లతో మన ఆరోగ్యానికి భరోసాగా వుంటుందంటున్నారు



**అభ్యుదయ రైతు హరికృష్ణ**

దశాబ్ద కాలంగా గోఆధారిత వ్యవసాయంతో అత్యధిక దిగుబడులు సాధిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు పసపల హరికృష్ణారెడ్డి. పెనుమూరు మండలం దాసరపల్లెకు చెందిన హరికృష్ణారెడ్డి తన మూడెకరాల పొలంలో జామ, నేరేడు, నిమ్మ, సపోటా, మామిడి, అరటిపంటలను సాగు చేస్తున్నారు. మరోవైపు దేవీ వరి వంగడాలు, చిరుధాన్యాలు,కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. రైతు సాధికార సంస్థలో చిరుద్యోగిగా కొనసాగుతూనే, పది సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులో పంటలు పండిస్తున్నారు. దేశీయ ఆవులు పట్టుకుని బీజామృతం, జీవామృతం, ఆచ్ఛాదన, వాపనవంటి ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. జామసాగులో పేరుమోసిన హరికృష్ణారెడ్డి చందన మాధురి అనే రకం సాగు చేస్తూ ఎకరానికి 15 నుంచి 20 టన్నుల ఉత్పత్తి సాధిస్తున్నారు. చిరుధాన్యాలు పండించి అత్యధిక ఆదాయం పొందుతున్నారు. పండించిన పంటలను మద్రాసు, బెంగళూరు, హైదరాబాదు, నంద్యాల, కడప, నెల్లూరు వంటి నగరాలకు పంపి మార్కెట్ చేసుకోగలుగుతున్నారు. వ్యవసాయంలో రసాయన ఎరువులు, మందులు, కలుపు మందుల వాడకం తగ్గించేందుకు వివిధ సంస్థలతో కలిసి ప్రకృతి వ్యవసాయ విధానాన్ని, గో ఆధారిత వ్యవసాయపద్ధతులను విద్యార్థులకు, మహిళా సంఘాలకు, రైతులకు నేర్పిస్తున్నారు. ఇందుకోసం పులిగుంటీశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేశారు. హరికృష్ణారెడ్డి కృషిని గుర్తించిన లయన్స్ క్లబ్, జిల్లా ఉద్యానశాఖ, జిల్లా వ్యవసాయశాఖ, రైతునేస్తం ఫౌండేషన్ ఆయనకు పురస్కారాలు అందించాయి.

**సిరులు కురిపిస్తున్న తైవాన్‌జామ**

పెద్దపంజాణి మండలంలోని లింగాపురం వద్ద సాగవుతున్న తైవాన్ రకం జామ పంట సిరులు కురిపిస్తోంది. పలమనేరుకు చెందిన డాక్టర్ బలరాం కుటుంబం లింగాపురం వద్ద తమ పొలంలో ప్రయోగాత్మకంగా తైవాన్ రకం జామను సాగు చేయిస్తోంది. వారి తరపున పని చేస్తున్న మునిరాజు దాదాపు 4.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట సాగుచేశాడు. కర్ణాటకనుంచి వంగడాన్ని తెప్పించారు. ఎకరానికి దాదాపు వెయ్యి మొక్కల వంతున 4500మొక్కలను పెంచుతున్నారు. ఒక్కోమొక్క వంద రూపాయలతో కొనుగోలు చేసిన ఈ తైవాన్ రకం జామ మొక్కలు నాటిన ఆరునెలలకు కాయలు కాస్తాయి. దాదాపు ఏడాది పొడవునా కాయలు కాస్తూనే ఉంటాయని మునిరాజ చెప్పారు. మొక్కలు నాటిన మొదటి ఏడాదిలోనే దాదాపు రూ 15 లక్షలకు పైగా



ఆదాయం వచ్చిందన్నారు. దాదాపు 12 ఏళ్ళపాటు కాయలు కాస్తాయన్నారు. కోసిన కాయలను వ్యాపారులు తోటవద్దకే వచ్చి తీసుకుపోతుంటారని, లేనిపక్షంలో పలమనేరు, కోలారు, బెంగళూరు, చెన్నై, విజయవాడ మార్కెట్లకు తరలిస్తుంటామన్నారు. ఎటువంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకునే ఈ పంటధరలుకూడా నిలకడగా ఉంటాయన్నారు. ■

## మిరప పంటకు తెగుళ్ళ బెడద

**వా**తావరణంలో ఏర్పడిన మార్పులతో పంటలను తెగుళ్ల బెడద వెంటాడుతోంది. ఎన్ని పురుగు మందులు వినియోగించినా తెగుళ్లు నివారణ కావడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజులుగా తరచూ మంగు వాతావరణం ఉండడంతో పైర్లకు తెగుళ్లు ఆశిస్తున్నాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు కర్షకులు నానా అగచాట్లు పడుతున్నారు. విపరీతంగా పురుగు మందులు వినియోగిస్తూ పిచికారి చేస్తూ అధిక భారాన్ని మోస్తున్నారు. అయినా తెగుళ్లు అదుపులోకి రాలేదని రైతులు వాపోతున్నారు.

మిరప పైరును నల్ల నల్లి ఆశించి నలిపేస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఆరుగాలం కష్టించి పంట దశకు తెచ్చుకున్న మిరపకు నల్లి సోకడంతో ఆకులన్నీ ముడుచుకు పోయి చివర్లు ఎర్రగామారి పూత, పిందె నేల రాలుతోంది. చెట్లు పచ్చదనం, నునుపును కోల్పోయి నిర్జీవంగా తయారవడంతో ఏమి చేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో రైతుల వద్దకు కొత్త కొత్త కంపెనీలు ప్రతినిధులు వచ్చి వారి మందులను అంటగడుతున్నారు. దీంతో వేలకు వేలు అదనంగా ఖర్చు చేస్తూ రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు.

*(21వ పేజీ తరువాయి ...)*

## వానాకాలంలో ఆరోగ్యకర ఆహారం

సమయంలో అందం కాపాడుకోవాలంటే కొన్ని చిట్కాలు పాటించాల్సిందే.

- వర్షాకాలంలో తడవటం వల్ల జుట్టు పాడవుతుంది. కుదుళ్లు దెబ్బతింటాయి. వాతావరణ కాలుష్యం వల్ల చినుకుల్లో ఇతర రసాయన పదార్థాలు కూడా ఉంటాయని మర్చిపోకూడదు. అందుకే వానల్లో తడవద్దు. పైగా కొబ్బరినూనెను పట్టించుకోవటం మర్చిపోరాదు. షాంపూతో వాష్ చేశాక కుదుళ్లు గట్టిగా ఉండటంతో పాటు ఫ్రెష్‌గా అనిపిస్తుంది.
- అలవెరా, అరటి, నిమ్మ, ఉసిరికాయ, కుంకుడు, సీకాయలతో జుట్టుమరింత ఆరోగ్యంగా ఉంటుంది.
- కొందరు వానాకాలం కదా...అని తక్కువ నీళ్లు తాగుతారు. ఇది మంచిది కాదు. దప్పిక అయినప్పుడు కచ్చితంగా నీళ్లు తాగాల్సిందే. మందారపూలు, మందార ఆకుల రసం, నిమ్మ, అలవెరాలాంటి సహజమైన ఉత్పత్తులతో ఫేస్‌మాస్క్ వేసుకోవాలి.
- చర్మాన్ని చల్లబరిచేందుకు క్లెన్సింగ్, టోనింగ్, మాయిశ్చరైజింగ్ చేయాలి.
- వర్షాకాలం సింథటిక్, బిగుతైన దుస్తులను వాడకూడదు, దద్దుర్లు వచ్చే అవకాశం ఉంది.
- విటమిన్ ఎ, సి ఉండే టమాటాను ఆహారంలో ఉండేట్లు చూసుకోవాలి. దీనివల్ల చర్మకణాలు డ్యామేజ్ కావు. నల్లని మచ్చలు తొలగిపోతాయి. కొల్లాజిన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఆపిల్, అరటి, దానిమ్మ తినాలి. తాజా పండ్లనే తినాలి. వేడివేడి ఆహారపదార్థాలనే తినాలి. ఫాస్ట్‌ఫుడ్ తినకూడదు. అల్లం టీ ప్రతిరోజూ తాగాలి. వీలైనంతవరకూ గోరువెచ్చని నీటిని తాగాలి. ముఖ్యంగా వార్షాకాలంలో చర్మం, జుట్టు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి.

– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ...

■

పరోపకారాన్ని మించిన ఆనందం ఇంకేదీ వుండదు

# కుంకుడు సాగుతో జాతీయ పురస్కారం!

వ్యవసాయం చేయాలన్న ఇష్టం, సాగుపై అవగాహన ఉండాలే కానీ.. బంజరు భూముల్లోనూ బంగారం పండించ వచ్చని కొందరు రైతులు నిరూపిస్తున్నారు. సరికొత్త ఆలోచనలతో వ్యవసాయం చేస్తూ.. సంప్రదాయ పంటలే కాకుండా రకరకాల వాణిజ్య పంటలు సాగు చేస్తూ.. అతితక్కువ పెట్టుబడులతోనే అదిరిపోయే రాబడి సాధిస్తున్నారు. మట్టిపై ప్రేమ, భూమిపై నమ్మకం పెట్టుకుంటే.. రాళ్లు రప్పలూ ఉన్న స్థలంలోనూ రతనాలు పండించొచ్చు అని నిరూపిస్తున్నారు. అచ్చంగా ఆ కోవకే చెందుతారు.. తెలంగాణా రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన లోకసాని పద్మారెడ్డి.



ఎకరాకు కేవలం 5 వేల పెట్టుబడి పెట్టి రూ.13 లక్షల ఆదాయం పొందుతున్నారు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా కుంకుడు మొక్కల నర్సరీని ఏర్పాటు చేసిన లోకసాని పద్మారెడ్డి.. 'మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా' పురస్కారానికి ఎంపికవటం విశేషం. చందంపేట మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన లోకసాని పద్మారెడ్డి అనే రైతుకు.. 12 ఎకరాల భూమి ఉంది. నీటి వసతి అంతగా లేకపోవటంతో.. భూమి అంతా బీడువారిపోయింది. అయితే.. కరువు ప్రాంతంలోనూ పద్మారెడ్డి.. ధైర్యంగా ముందడుగు వేశారు.

కుంకుడు మొక్కలకు పెద్దగా నీటి అవసరం లేదని తెలుసుకున్న పద్మారెడ్డి.. తనకు ఉన్న 12 ఎకరాల్లో 1991లోనే 1200 కుంకుడు మొక్కలు నాటాడు. ఒక్కో మొక్క నుంచి 250 నుంచి 300 కిలోల కుంకుడు కాయల దిగుబడి వస్తోంది. అలా ఎకరాకు 25 నుంచి 30 టన్నుల దిగుబడి సాధిస్తున్నారు. కాగా.. కిలో కుంకుడుకాయలను రూ.120 నుంచి రూ.150 వరకు మార్కెట్‌లో అమ్ముతున్నారు. కుంకుడు తోట పెట్టి ఎకరానికి 13 లక్షలకు పైగా ఆదాయం పొందుతున్నారు.

ఆయన సాగుబడి మొత్తం సేంద్రియ విధానంలోనే చేస్తుండటం గమనార్హం. దీంతో.. దేశంలోనే మొట్ట మొదటి సారిగా కుంకుడు కాయల మొక్కల నర్సరీని పెంచారు పద్మారెడ్డి. కుంకుడు కాయల గుజ్జు, గింజల పొడితో సౌందర్య ఉత్పత్తులతో పాటు ఔషధాలు కూడా తయారు చేయవచ్చని పద్మారెడ్డి చెప్తున్నారు. పద్మారెడ్డి నర్సరీలో పెంచిన కుంకుడు మొక్కలను ఛత్తీస్‌గఢ్ అటవీశాఖ అధికారులు దిగుబడి చేసుకుంటున్నారు. పేస్ట్, సబ్బులను తయారు చేసి నాబార్డ్ ద్వారా విక్రయిస్తున్నారు.

కేవలం కుకుండు సాగే కాకుండా బత్తాయి, నిమ్మ, జామ, బొప్పాయి తోటలను కూడా పద్మారెడ్డి పండిస్తున్నారు. ఇవన్నీ.. సహజ, సేంద్రియ ఎరువులతోనే సాగు చేస్తుండటం గమనార్హం. బీడు భూముల్లోనూ పద్మారెడ్డి అవిష్కరిస్తున్న అద్భుతాలను గుర్తించి.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌ఘఢ్ రైతులు ఆయన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి.. ఉద్యాన పంటల సాగులో మెలకువలు నేర్చుకుంటున్నారు.

దేశంలోని ఉత్తమ రైతుల సేవలను గుర్తిస్తూ , 'భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి' పురస్కారాలను అందిస్తున్న విషయం తెలిసిందే. దేశంలోనే మొట్టమొదటి కుంకుడు మొక్కల నర్సరీని ఏర్పాటు చేసిన లోకసాని పద్మారెడ్డిని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి 'మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా' పురస్కారానికి ఎంపిక చేయటం గమనార్హం. పెద్ద కమతాలు ఉండి, సీజనల్ పంటలు సాగు చేసుకోలేక బీడు పెడుతున్న రైతులు ఈ కుంకుడు తోటలను సులువుగా సాగు చేసుకోవచ్చని, ఫలితంగా మంచి ఆదాయం పొందొచ్చని పద్మారెడ్డి సూచిస్తున్నారు. ■

ఎంతటి మహా ప్రవాహమైనా చిన్న నీటి ధారగానే మొదలవుతుంది

# కోటీశ్వరులను చేసే జి ఎస్ టి బిల్లులు !

**కేం**ద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన 'మేరా బిల్–మేరా అధికార్' పథకం ద్వారా సాధారణ వ్యక్తులు కూడా కోటీశ్వరులు కావచ్చు. సెప్టెంబర్ 1న ప్రారంభమైన ఈ పథకం కింద, జి ఎస్ టి బిల్లులు అప్‌లోడ్ చేసే వ్యక్తులకు 1 కోట్ల రూపాయల వరకు బహుమతులు లభిస్తాయి. ఈ పథకం ద్వారా వినియోగదారులు జి ఎస్ టి బిల్లులను కోరేలా ప్రోత్సహించడం, పన్ను మోసాలను తగ్గించడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. ఇప్పుడు ఈ పథకం గురించిన వివరాలను తెలుసుకుందాం.

**ఎలా దరఖాస్తు చేయాలి :** ఈ పథకం కింద ఎవరైనా లబ్ధి పొందవచ్చు. వినియోగదారులు జి ఎస్ టి బిల్లులను సరిగ్గా అప్‌లోడ్ చేసి రూ. 1 కోటి గెలుచుకోవచ్చు. కానీ, కనీసం రూ.200 విలువైన బిల్లు తప్పనిసరిగా సమర్పించాలి. ముందుగా 'మేరా బిల్ – మేరా అధికార్' యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేయాలి. లేదా web.merabill.gst.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా బిల్లులను అప్‌లోడ్ చేయవచ్చు. అయితే, ఒక్క వ్యక్తి నెలకు గరిష్టంగా 25 బిల్లులు మాత్రమే అప్‌లోడ్ చేయగలరు.




**అప్‌లోడ్‌చేసే బిల్లుల పరిమితి :** ఒక్క వ్యక్తి నెలకు గరిష్టంగా 25 బిల్లులను మాత్రమే అప్‌లోడ్ చేయవచ్చు. ఒక్కొక్క బిల్లుకు కనీసం 200 రూపాయల ఖర్చు ఉండాలి.

**లక్కీ డ్రా అర్హత :** ప్రతి నెల 5వ తారీకు నాటికి అప్‌లోడ్ చేసిన బి టు సి (బిజినెస్ టు కస్టమర్) బిల్లులు లక్కీ డ్రాలో అర్హత పొందుతాయి.

**త్రైమాసిక బంపర్ డ్రా :** మూడు నెలల బిల్లుల ఆధారంగా పెద్ద బహుమతులు అందించే డ్రా ఉంటుంది.

**బిల్ వివరాలు:** ప్రతి బిల్లును అప్‌లోడ్ చేసే సమయంలో సరఫరాదారు జి ఎస్ టి ఐ ఎన్ , బిల్ నెంబర్, తేదీ, బిల్ విలువ, కస్టమర్ వివరాలు ఇవ్వాలి.

**వ్యవస్థ అంగీకారం :** తప్పు లేదా నకిలీ జి ఎస్ టి ఐ ఎన్ లను, నకిలీ బిల్లులను సిస్టమ్ తిరస్కరిస్తుంది.

**కనిష్ఠ బిల్లు విలువ :** రూ. 200 విలువ ఉన్న బిల్లులు మాత్రమే లక్కీ డ్రాలో అర్హత పొందుతాయి. ప్రతి అప్‌లోడ్ చేసిన ప్రతి బిల్లుకోసం ఒక ప్రత్యేకమైన రిఫరెన్స్ నెంబర్ (ఎ ఆర్ ఎన్) జెనరేట్ అవుతుంది.

**అవసరమైన పత్రాలు:** ఈ పథకంలో పాల్గొని కోటీశ్వరులు కావాలంటే కొన్ని పత్రాలు సమర్పించాలి. జి ఎస్ టి బిల్లు కాకుండా, పాన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలు అవసరం. జి ఎస్ టి బిల్లులో షాపు ఇన్వాయిస్ నెంబర్, జి ఎస్ టి ఐ ఎన్ , చెల్లింపు మొత్తం, పన్ను మొత్తం వివరాలు తప్పనిసరిగా ఉండాలి

**గెలుచుకోండి లక్షలు, కోట్లు:**
రూ. 200 కు తగ్గని జి ఎస్ టి బిల్లులను సమర్పించడం ద్వారా ప్రతి నెల రూ. 10 లక్షల వరకు గెలుచుకునే అవకాశం ఉంది. ప్రతి మూడు నెలలకు జరిగే బంపర్ డ్రాలో రూ. 1 కోటి గెలుచుకునే అవకాశం కూడా ఉంటుంది. జి ఎస్ టి బిల్లుకు కనీస పరిమితి రూ. 200గా నిర్ణయించినప్పటికీ గరిష్ట పరిమితి లేదు.

**ఈ పథకం ఈ రాష్ట్రాల్లో మాత్రమే:** ప్రస్తుతం ఈ పథకాన్ని కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే ప్రారంభించారు. అవి గుజరాత్, హర్యానా, అస్సాం , పుదుచ్చేరి, దమన్ – డీయూ, దాద్రా – నగర్ హవేలీ . ఈ పథకం పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించబడింది, ఇది వచ్చే సంవత్సరం వరకు అమల్లో ఉంటుంది.

■

దారి లేదని నిరాశ చెందకు, మూసుకుపోయినట్టు కనిపించేదారి ఒక మేలు మలుపు కావచ్చు

# అధిక వర్షాలు, తెగుళ్ళతో మామిడి దిగుబడిపై దిగులు

**మా**మిడి రైతుకు దిగుబడి దిగులు పట్టుకుంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది మామిడి పూత ఆలస్యమవుతోంది. నేటికీ రాలేదు. దీంతో దిగుబడిపై ఎక్కడ ప్రభావం పడుతుందోనని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఏటా నవంబరు చివరికల్లా మామిడిచెట్లు పూతలో నిండి ఉండేవి. వాతావరణ మార్పుల కారణంగా ఈసారి నేటికీ మామిడి పూత జాడ లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే దిగుబడి ప్రశ్నార్థకం కానుంది. చీడపీడలు అధికంగా ఉండడంతో అరకొరగా వచ్చిన పూత కూడా రాలిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సాధారణంగా మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టకుండానే సీజన వచ్చిందంటే పూత విరగ బూసేది. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. పొగ మంచు, రాత్రి, పగటి ఉష్ణోగ్రతలు తగ్గడం పూతపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

**ప్రతికూల వాతావరణ పరిస్థితులు**

మామిడిపంటకు వాతావరణ పరిస్థితులు సహకరించడం లేదు. ఏటా డిసెంబరు మొదటివారం నాటికి పూర్తిస్థాయిలో పూత వస్తుంది. జనవరి, ఫిబ్రవరిలో పిందెలు ఏర్పడి తదుపరి కాయలొస్తాయి. శివరాత్రి నాటికి శివలింగమంత కాయ లుంటాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అధిక వర్షాలు పడడం, రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరగడం, తెగుళ్ల ప్రభావంతో పూత ఆశించిన మేర రాలేదు. తేనెమంచు, బూడిదరంగు, తామర తెగుళ్లు మరింత దెబ్బ కొడుతున్నాయి. ఎకరాకు 140నుంచి 150 మొక్కలు పెంచగా, పంట చేతి కొచ్చేనాటికి రూ.50వేలు పెట్టుబడి అవుతోందని రైతులు అంటున్నారు. మామిడి తోటలపై ప్రకృతి ప్రభావం ఎంతో ఉంటుంది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు పూత, కాపుపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇక్కడి నుంచి కాయలను బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు.

**వ్యాపారులు రాం..రాం..**

ఏటా ఈ సమయానికి మామిడిచెట్ల నిండా పూత వచ్చేది. పూతను చూసి, మామిడి తోటలను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. పూత బాగుంటే అధిక ధర ఇచ్చేందుకు సైతం వెనకాడతారు. ఈసారి నేటికీ పూత ఏర్పడక పోవడంతో వ్యాపారులు తోటలను కొనేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

**వ్యాపారులు ముందుకు రావట్లేదు:**

రెండున్నర ఎకరాల్లో మామిడి సాగు చేశా. ఏటా ఈ సమయానికి మామిడి చెట్లు పూతతో నిండిఉండేవి. ఈసారి పూత కనిపించట్లేదు. వ్యాపారులు కూడా పూత రావడం లేదన్న కారణంతో తోటలు కొనుగోలు చేయడానికి ముందుకు రావట్లేదు.

*గంగులప్ప, రైతు, కుటాగుళ్ల*

**ఖర్చు పెరిగింది:**

రెండెకరాల్లో మామిడి చెట్లు పెట్టా. దుక్కి, పాదులు, కొమ్మలు కత్తిరించడం, ఎరువులు, మందులు, కూలీలు, కంచె ఏర్పాటు తదితరాలకు అధికంగా ఖర్చవుతోంది. వీటన్నింటినీ భరిస్తూ చెట్లను కాపాడుకుంటున్నాం. ప్రస్తుతం పూత రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. సంబంధిత అధికారులు పంటలవైపు కన్నెత్తి చూడట్లేదు.

*తిరుపాల్, రైతు, యాకాలచెరువు*

**సూచనలు పాటించాలి:**

**ప్రతాపరెడ్డి, ఉద్యాన శాఖాధికారి, కదిరి**

వాతావరణ మార్పులతోనే మామిడి పూత ఆలస్యమవుతోంది. పగటి పూట చల్లగా ఉంటుండడం తీవ్ర ప్రభావం చూపుతోంది. రెండుమూడుసార్లు దుక్కి దున్నడంతోనే అధికంగా తేమ ఆవిరవుతుంది. పదిగ్రాముల పొటాషియం నైట్రేట్ (13:0:45) లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తరువాత ఐదు గ్రాముల ఫార్ములా–4ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తద్వారా పూత వస్తుంది. తెగుళ్లు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ■

# ఆదాయ మార్గంగా చిరుధాన్యాల టిఫిన్‌లు !

ప్రస్తుతం చిన్న వ్యాపారాలు ఎంతగా ప్రాచుర్యం పొందుతున్నాయో అందరికీ తెలుసు. తక్కువ పెట్టుబడితో ఇంటి నుంచే ప్రారంభించగలిగే అనేక వ్యాపార అవకాశాలు ఉన్నాయి. దీనికి తోడుగా సోషల్ మీడియా మార్కెటింగ్ సేవలు కూడా సహాయపడుతాయి. మీరు కూడా బిజినెస్ స్టార్ట్ చేయాలని ఆలోచిస్తున్నారా? అయితే ఈ బిజినెస్ ఐడియా మీ కలలను నెరవేరుస్తుంది. ఈ బిజినెస్‌కు మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంది. ఎలా ప్రారంభించాలి అనే వివరాలు తెలుసుకుందాం.



ఆహారం అనేది ప్రతి ఒక్కరికి అత్యంత అవసరం. అందుకే ఆహార వ్యాపారానికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా నేటి బిజీ లైఫ్‌స్టైల్ వల్ల ఇంట్లో వండుకొని తినడానికి సమయం దొరకడం లేదు.

చాలా మంది బిజీ లైఫ్‌స్టైల్‌ను అనుసరిస్తున్నారు. వంట చేయడానికి సమయం దొరకడం లేదు. స్మార్ట్‌ఫోన్‌ల రాకతో చాలా మంది ఆన్‌లైన్‌లో ఆహారాన్ని ఆర్డర్ చేస్తున్నారు. మరి కొంతమంది రోడ్‌సైడ్ హోటళ్లలో ఆహారం సరసమైన ధరలకు లభిచడంతో హోటల్ ఫూడ్‌కు అల్లవాటు పడుతున్నారు. కాబట్టి ఈ పరిస్థితి ఫుడ్ బిజినెస్‌లో ప్రారంభించాలని అనే వారికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఇప్పుడు చాలామంది ఫుడ్ బిజినెస్‌లోకి రావడానికి ఆసక్తి చూపుతున్నారు. కానీ ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించే వ్యాపారం ప్రత్యేకంగా ఆకర్షణీయంగా ఉంటుంది

ఈరోజు మీరు తెలుసుకొనే బిజినెస్ చిరుధ్యానాల టిఫిన్ సెంటర్ వ్యాపారం. ప్రజలు ఇప్పుడు ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. వారు రుచికరమైన ఆహారంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహారాన్ని కూడా కోరుకుంటున్నారు.

వెజిటేరియన్, వీగన్, గ్లూటెన్-ఫ్రీ వంటి నిర్దిష్ట ఆహార అలవాట్లు ఉన్న వారి సంఖ్య పెరుగుతోంది. కాబట్టి ఈ వ్యాపారం ఎంతో లాభదాయకం. చిరు ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటితో తయారుచేసే ఆహారాలు శరీరానికి కావాల్సిన శక్తిని, పోషకాలను అందిస్తాయి. దీంతో ప్రతిరోజూ వివిధ రకాల టిఫిన్‌లను తయారు చేసి అమ్మితే బోలెడు లాభాలు కలుగుతాయి. మీ వ్యాపారం మూడు పూలు-ఆరు కాయలు అవ్వడం ఖాయం.

ఈ బిజినెస్ ప్రారంభించే ముందు మీ టిఫిన్ సెంటర్‌ను ఏ ప్రాంతంలో ప్రారంభించాలనుకుంటున్నారు అక్కడ ఆరోగ్య ఆహారంపై ఆసక్తి ఎంత ... అనే అంశాలను మాత్రం జాగ్రత్తగా గమనించాలి. ఆహారం తయారుచేసి అమ్మడానికి అవసరమైన లైసెన్స్‌లు తీసుకోవాలి.

ఆహార వ్యాపారం ప్రారంభించడానికి రూ. 10వేల నుంచి రూ. 30 వేలు పెట్టుబడి పెట్టుకోవాల్సి ఉంటుంది. ఈ వ్యాపారాన్ని ఇంటి నుంచి కూడా ప్రారంభించవచ్చు.

చిన్న స్టాల్‌లో ఈ వ్యాపారం చేసినా కూడా మంచి లాభాలు వస్తాయి. ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు పనిచేస్తే నెలకు దాదాపు రూ. 60,000 సంపాదించవచ్చు. ■

ఏ జీవికి లేని వరం నవ్వు... అది చీకటిని వెలిగించే వెన్నెల పువ్వు

# క్యాన్సర్‌ను జయించి... వ్యాపారంలో రాణించి ...



**ఆ**మె ప్రాణాంతకమైన క్యాన్సర్ బారిన పడింది. అంతలోనే భర్తకూ అదే వ్యాధని తెలిసింది. అయినా ఆమె కుంగిపోలేదు. అప్పటికి కేవలం వ్యాపకంగా ఉన్న పచ్చళ్ల తయారీని వ్యాపారంగా విస్తరించింది. పిల్లల భవిష్యత్తు కోసం మనోధైర్యంతో ముందుకు సాగుతూ, ఒక సంస్థను నెలకొల్పింది. తద్వారా, మరికొందరు మహిళలకు కూడా జీవనోపాధి కల్పించి... వారిలో ఆత్మ విశ్వాసం నింపు తున్నారు లవీనా జైన్! ఆమె వ్యాపార విజయం ఆమె మాటల్లోనే ...

"మాది మీరట్. మా ఆయన సందీప్ జైన్. మాకు ఇద్దరు పిల్లలు. బాబు కిన్షుక్, పాప కృతిక. నలుగురం సొంత ఇంట్లో సంతోషంగా ఉండేవాళ్లం. పచ్చళ్లు పెట్టడం, స్క్వాష్‌లు తయారు చేయడమంటే నాకు చాలా ఇష్టం. వీటిని నిల్వచేసే విధానాలకు సంబంధించి చిన్న కోర్సు కూడా పూర్తిచేశా. పచ్చళ్లు, ఊరగాయలు, జామ్‌లను విభిన్న రుచుల్లో రకరకాలుగా తయారుచేసి బంధువులకు, స్నేహితులకు పంచుతుండేదాన్ని. రుచి అమోఘమని, చిన్నపాటి వ్యాపారాన్ని ప్రారంభిస్తే మంచి పేరు, డబ్బు వస్తాయని చెబుతుండేవారు. వాళ్ల పొగడ్తలకు చాలా ఆనందం వేసేది.

**బాధను భరిస్తూ...**

"అంతా సంతోషంగా సాగుతుందని అనుకుంటుండగానే జీవితం అనుకోని మలుపు తిరిగింది. అనారోగ్యంగా అనిపిస్తే నేను, ఆయన ఆసుపత్రికి వెళ్లాం. ఇద్దరికీ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు వైద్యులు. కాళ్ల కింద భూమి కదులుతున్నట్లు అనిపించింది. పిల్లలు గుర్తుకువచ్చి కన్నీళ్లు ఆగలేదు. ఎలాగైనా ఈ కష్టం నుంచి గట్టెక్కాలని బలంగా నిర్ణయించుకున్నాం. బంధువులంతా ఇంటిని అమ్మేయమన్నారు. దానికి నా మనసు అంగీకరించలేదు. మావద్ద ఉన్న కొద్దిపాటి సొమ్ముతోనే కీమోథెరపీ చేయించుకోవాలనుకున్నాం. చాలా బాధ అనుభవించాం. సరిగ్గా ఈ సమయంలోనే ప్రభుత్వం 'ఫుడ్ ప్రిజర్వేషన్ ట్రెయినింగ్'ను ప్రారంభిం చింది. వెంటనే అందులో చేరా. కీమో థెరపీ సెషన్ పూర్తయిన వెంటనే తరగతులకు హాజరయ్యా.

**నోటి మాటతోనే...**

"క్రమంగా క్యాన్సర్ నుంచి ఇద్దరం కోలుకున్నాం. నాకున్న పరిజ్ఞానంతో పచ్చళ్లు, జామ్‌ల వ్యాపారాన్ని ప్రారంభించాలనుకున్నా. అప్పుడు నా దగ్గర 1500 రూపాయలు మాత్రమే ఉన్నాయి. ఆ డబ్బుతోనే మొదట లెమన్ స్క్వాష్, తండాయి తయారు చేశా. పిల్లల సహకారంతో పాత గాజు సీసాల్లో వీటిని నింపాను.

ఆ రోజుల్లో మహిళలు ఎక్కువగా కిట్టీ పార్టీలు చేసుకునేవాళ్ళు. అక్కడికి ఈ సీసాలు తీసుకెళ్లి అమ్మకానికి పెట్టేదాన్ని. ఇంట్లో తయారు చేసినవి అనగానే వాళ్లు ఆసక్తి చూపేవారు. రుచి కూడా నచ్చడంతో ఎగబడి కొనేవాళ్లు. క్రమంగా ఊరగాయలు, స్క్వాష్‌లు కూడా తయారుచేసి నా ఉత్పత్తులను పరిచయం చేసేందుకు స్టాల్స్ ప్రారంభించా. మొదట వచ్చిన పెద్ద ఆర్డర్... రెండు కిలోల మామిడికాయ పచ్చడి. ఆ నోటా ఈ నోటా విని ఆర్డర్లు పెరిగాయి."

**నాణ్యతకే పెద్ద పీట...**

"వ్యాపారం విస్తరిస్తుండడంతో ఇంట్లోనే 'తృప్తి ఫుడ్స్' పేరుతో ఒక యూనిట్ ప్రారంభించా. పిల్లలు, భర్త పూర్తి సహకారం అందించారు. యూనిట్ పనుల్లో సహాయం కోసం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలను నియమించుకున్నా. కాలానుగుణంగా లభించే పండ్లు, కాయలతో ఉత్పత్తులను నిర్ణయించి తయారుచేస్తాం. అందుకు స్థానిక మార్కెట్ల నుంచి తాజాగా ఉన్నవాటిని మాత్రమే ఎంచుకుని కొనుక్కొస్తాం. ఉత్పత్తుల నిల్వకోసం

నిందలు, పొరపాట్లు, అపోహలు, ఓటములు, అవమానాలు, మానసిక క్షోభ, తిరస్కారాలు గెలుపు నిచ్చెనకు వుండే మెట్లు !

# జానపద నర్తనంతో.... జాతీయ 'ప్రకాశం' !

(19 పేజీ తరువాయి ...)



పుత్తూరి అంబరీష్-ఈపీ విభాగం (సిల్వర్), వి.లోకేష్ సాయి-ఈపీ విభాగం (బ్రాంజ్), ఎస్కే ఆసీఫా-ఈపీ విభాగం (బ్రాంజ్), క్రిష్టంశెట్టి ప్రణీత-ఫాయల్ విభాగం (బ్రాంజ్ మెడల్) సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఈ నలుగురు క్రీడాకారులు ఈనెల 31 నుంచి జనవరి 3వ తేదీ వరకు కేరళ రాష్ట్రం కన్నూర్ పట్టణంలోని ముండయాడ్ ఇండోర్ స్టేడియంలో జరిగే 35వ సీనియర్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటనున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ జిల్లా వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, కోచ్‌లు బి.భరత్, ఆర్.విజయలక్ష్మి, డి.రాజు అభినందించారు.

## నెట్‌బాల్ పోటీలకు దొనకొండ విద్యార్థిని

**స్థా**నిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువు తున్న ఎనుబరా ఫైసీ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 21, 22వ తేదీలలో కర్నూలు డీఎస్ఎ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్ బాల్ పోటీలలో ప్రతిభ చూపటంతో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైనట్లుగా ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహారావు తెలిపారు. ఈ నెల 28 నుంచి చెన్నయ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఫైసీకి అభినందన సభ ఏర్పాటు చేశారు.



## జాతీయ ఖో-ఖో పోటీలకు కేవీపల్లి విద్యార్థిని

**జా**తీయస్థాయి ఖో-ఖో పోటీలకు ప్రకాశంజిల్లా కంచర్లవారిపల్లి హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని బసిరెడ్డి కల్యాణి ఎంపికైనట్లు హెచ్ఎం విజయభాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు.

ఈనెల 2 నుంచి 4 వరకు అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో కంచర్లవారిపల్లి గ్రామానికి చెందిన బసిరెడ్డి కల్యాణి పాల్గొన్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్‌లు, పీడీ కాశీవిశ్వనాథ్‌రెడ్డి కల్యాణిని అభినందించి సత్కరించారు. ■

---

ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి ప్రకారమే సోడియం బెంజోయేట్‌ని కలుపుతాం. కృత్రిమ రంగులు అసలు కలపం. పెద్ద ఆర్డర్లు వచ్చినపుడు వాటి తయారీ, నిల్వ, ప్యాకింగ్ అంశాల్లో చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రస్తుతం మా యూనిట్ నుంచి 70 రకాలు తయారు చేస్తున్నాం. మేం పెట్టిన పచ్చళ్లు, ఊరగాయలు తిన్నవాళ్లు 'అచ్చం అమ్మమ్మ చేసినట్లే ఉన్నాయి' అంటుంటారు. ఇది మాకెంతో సంతృప్తినిస్తుంది.

**అదే అందరికీ ఇష్టం...**

మా ఉత్పత్తుల్లో 'హింగ్ అచార్' బాగా ప్రాచుర్యం పొందింది. యూనిట్ మొత్తం అమ్మకాల్లో మూడొంతులు దీనిదే. లీఫీ స్క్వాష్, యాపిల్ జామ్, కీవీ జామ్, పైనాపిల్ క్రష్, స్ట్రాబెర్రీ స్క్వాష్‌లకు మంచి ఆదరణ ఉంది. స్థానికంగా నిర్వహించే ఎగ్జిబిషన్లు, ప్రత్యేక ఈవెంట్లలో స్టాల్స్ పెడుతుంటాం. మీరట్‌లో నాలుగు రిటైల్ అవుట్‌లెట్లు ప్రారంభించాం. ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లో కూడా మా ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. ■

# బానపొట్టను కరిగించే బహు భేషైన పండ్లు !

బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోవడంవల్ల పొట్ట గుండ్రంగా పెద్దగా కనిపిస్తుంది. దీనినే బానపొట్టగా పరిగణిస్తుంటారు. దీనివల్ల శరీరాకృతి అందంగా కనిపించదు. అంతేకాకుండా గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. యాంటీ ఆక్సిడెంట్లు, పీచుపదార్థాలు, ఇతర పోషకాలు అధికంగా ఉన్న పండ్లు తరచూ తినడంవల్ల బానపొట్టను మెల్లగా తగ్గించవచ్చు. ఆ పండ్లు ఏమిటో చూద్దాం ...

**యాపిల్**

యాపిల్ పండులో చాలా తక్కువ క్యాలరీలు, అత్యధికంగా పీచుపదార్థాలు ఉంటాయి. ఇవి పొట్టలోని



కొవ్వులను కరిగించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి రోజూ ఒక యాపిల్ పండు తినడం వల్ల అందులోని పెక్టిన్ సమ్మేళనాలు జీర్ణక్రియ నెమ్మదిగా జరిగేలా చేస్తాయి. దీనివల్ల ఆకలి తగ్గి ఆహారం తినాలనిపించదు. దీంతో పొట్టలోని కొవ్వు కరగడం మొదలవుతుంది.

**నల్ల ద్రాక్ష**



నల్ల ద్రాక్ష, స్ట్రాబెర్రీ, రాస్‌బెర్రీ పండ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు, సి విటమిన్, ఇంకా పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఈ పండ్లను రోజూ తినడం వల్ల కొవ్వులకు సంబంధించిన జీవక్రియలు వేగంగా జరుగుతాయి. దీనివల్ల కడుపు ఉబ్బరం తగ్గుతుంది.

**నారింజ**



ఈ పండులో క్యాలరీలుండవు. సి విటమిన్, బీటా కెరోటిన్లు, ఫినోలిక్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి పొట్టలోని అన్ని రకాల కొవ్వులను వేగంగా కరిగిస్తాయి. ప్రతి రోజూ కనీసం రెండు నారింజ పండ్లు తినడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.

**అవకాడో**



అవకాడోలో ఉండే ఆరోగ్యకరమైనకొవ్వులు కడుపులో ఇన్‌ఫ్లమేషన్‌ని నివారిస్తాయి. కొవ్వులను కరిగించే హార్మోన్లను ఉత్తేజితం చేస్తాయి. అవకాడోలోని విభిన్నమైన పీచు పదార్థాలు పొట్టను పరిశుభ్రం చేస్తాయి. ప్రతి రోజూ ఈ పండు తినడం వల్ల బానపొట్ట నుంచి విముక్తి పొందవచ్చు

**పంపర పనస**

ఈ పండులో కూడా సిట్రస్ జాతి ఎంజైమ్‌లు, విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించి రక్తంలో చక్కెరలు పెరగకుండా చేస్తాయి.

దీనివల్ల శరీరం పూర్తి స్థాయిలో శక్తిని వినియోగించుకుంటుంది. ఇంకా పంపర పనసపండు రసం తాగడం వల్ల ఉదరంలో నిల్వ ఉన్న కొవ్వులు క్రమంగా కరిగి

**అడ్డంకులు ఆశా జీవిని మరింత శక్తి మంతుణ్ణి చేస్తాయి, నిరాశాజీవిని అవే నీరుగారుస్తాయి**



బానపొట్ట తగ్గుతుంది.


**బొప్పాయి**



ఈ పండులో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను వేగవంతం చేసి కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. కడుపులో ఎటువంటి పదార్థాలు నిల్వ ఉండకుండా చేస్తుంది. బొప్పాయి లోని పీచు పదార్థాలు ప్రేగులను పరి శుభ్రం చేస్తాయి. ప్రతిరోజూ ఒక కప్పు బొప్పాయి పండు ముక్కలు తినడం వల్ల పొట్టలోని కొవ్వులు క్రమంగా కరిగిపోతాయి.

**పుచ్చపండు**

దీనిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఈ పండు తిన్నవెంటనే కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీనిలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. పుచ్చ పండులో ఉండే ఆర్జినైన్ అనే అమైనోయాసిడ్ కొవ్వులను వేగంగా కరిగిస్తుంది. ప్రతి రోజూ... రోజుకి రెండు కప్పుల పుచ్చకాయ ముక్కలు తినడం వల్ల శరీరానికి కావాల్సిన తేమ అందుతుంది. ఆకలి నియంత్రణలో ఉండి బానపొట్ట కరుగుతుంది.



**దానిమ్మ**

దానిమ్మ గింజల్లో పాలిఫెనాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. దీంతో కడుపులోని కొవ్వులు కూడా కరిగిపోతాయి.



**అనాస**

ఈ పండులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది పొట్టలో పేరుకున్న కొవ్వులను కరిగిస్తుంది. జీర్ణాశయం పనితీరుని మెరుగుపరుస్తుంది. కడుపులో తయారయ్యే వాయువులను బయటికి పంపుతుంది. ఈ పండు తిన్నపుడు దీనికి ఉన్న అరుదైన తీయదనం వల్ల కొన్ని రోజుల వరకు ఇతర తీపి పదార్థాలను తినాలనిపించదు. శరీర బరువు క్రమంగా తగ్గి పొట్ట పరిమాణంమామూలు స్థాయికి వస్తుంది.



**అరటి**



అరటి పండులో అధికంగా పొటాషియం ఉంటుంది. ఇది శరీరంలో అదనంగా నీరు నిల్వ ఉండకుండా చేస్తుంది.

దీనివల్ల శరీర భాగాల్లో చేరిన కొవ్వులన్నీ కరిగిపోతాయి. ప్రతిరోజూ ఉదయాన్నే రెండు అరటిపండ్లు తింటే ఆకలి నియంత్రణలో ఉంటుంది. శరీరమంతా తేలికగా ఉన్న భావన కలుగుతుంది. ■

నీవెంత ఉత్తముడివనుకున్నా , ఇతరులనుంచి నేర్చుకోవలసింది ఎప్పుడూ వుంటుంది

# ఇంటి ముందు ఇల్లాలి పేరుతో సాధించిన విజయం!

**ఒక** సర్పంచ్‌గా ఆమె చేసిన చిన్న ప్రయత్నం ఆ గ్రామ మహిళల ఆలోచనా విధానాన్నే మార్చేసింది. గృహిణి పేరుతో ఇంటి ముందు తగిలించిన నేమ్ ప్లేట్... వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. మగవారికి మగువ ఎందులోనూ తీసిపోదని చెబుతూ... వారిని సాధికారత దిశగా అడుగులు వేయిస్తున్నారు శేషన్‌దీప కౌర్ సిద్ధూ. ప్రస్తుతం పదవిలో లేకపోయినా... తన ప్రాంత మహిళలకు మార్గదర్శి అయ్యారు ఈ మాజీ సర్పంచ్.



“తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకొనే వరకూ ఇంట్లో ఆడవారికి క్షణం తీరిక దొరకదు. కానీ వారి కష్టం ఎవరికీ పట్టదు. వారి ఆవేదన అరణ్య రోదన. కనీస గుర్తింపునకు నోచుకోని జీవితాలు గృహిణులవి. కాలంతో పోటీపడి పరుగెడుతున్నా... ప్రపంచం మన అరచేతులోకి వచ్చేసినా... మా గ్రామంలో ఇంకా అసమానతలే. ఇది నన్ను కలచి వేసింది.

ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ఎవరో ఒకరు తొలి అడుగు వేయాలి. నేను చేసింది అదే. సర్పంచ్‌గా నాకు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని... గ్రామీణ మహిళల్లో చైతన్యం నింపే ప్రయత్నం చేశాను. పంజాబ్ బఠిండా జిల్లా మానక్‌ఖానా గ్రామం మాది. చిన్నప్పటి నుంచి నేను చదువులో ముందుండేదాన్ని. సివిల్స్ సాధించాలన్నది ఆశయం. దాని కోసం ఢిల్లీలో చదువు కొంటూ సన్నద్ధమయ్యాను.

ఒక సర్పంచ్‌గా ఆమె చేసిన చిన్న ప్రయత్నం ఆ గ్రామ మహిళల ఆలోచనా విధానాన్నే మార్చేసింది. గృహిణి పేరుతో ఇంటి ముందు తగిలించిన నేమ్ ప్లేట్... వారి ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచింది. మగవారికి మగువ ఎందులోనూ తీసిపోదని చెబుతూ... వారిని సాధికారత దిశగా అడుగులు వేయిస్తున్నారు శేషన్‌దీప కౌర్ సిద్ధూ. ప్రస్తుతం పదవిలో లేకపోయినా... తన ప్రాంత మహిళలకు మార్గదర్శి అయ్యారు ఈ మాజీ సర్పంచ్.

**గ్రామానికి తిరిగివచ్చి...**

సివిల్స్ కోసం కఠోరంగా శ్రమించాను. 2018లో తొలిసారి పరీక్ష రాశాను. కానీ విఫలమయ్యాను. అది నన్ను బాగా కుంగదీసింది. అంత కష్టపడినా ర్యాంకు సాధించలేక పోవడంతో తిరిగి మా గ్రామానికి వచ్చేశాను. ఈసారి ఇంటి దగ్గరే ఉండి చదువు కొందామని నిర్ణయించుకున్నాను. కానీ మనం ఒకటి తలిస్తే దైవం మరోలా తలుస్తుందంటారు. నా విషయంలోనూ అదే జరిగింది. మా ఊళ్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకొని... నన్ను సర్పంచ్‌గా ఉండమని అడిగారు. పురుషాధిక్యం ఉన్న మా ప్రాంతంలో ఒక మహిళకు ఇలాంటి అవకాశం రావడం అరుదైన పరిణామం. గతంలో మా గ్రామంలో ఏ మహిళ కూడా ఈ పదవిని అలంకరించలేదు. దాంతో అడగంగానే సరేనన్నాను.

**మార్పు వైపు తొలి అడుగు...**

సర్పంచ్ అయ్యాను. బానే ఉంది. కానీ అసలు సర్పంచ్‌గా నా విధులు, అధికారాలు ఏమిటన్న దానిపై స్పష్టత లేదు. ఎక్కడ మొదలు పెట్టాలి? ఎలా మొదలు పెట్టాలి? అంతా అయోమయం. కానీ మార్పు తేవడానికి నాకు లభించిన అద్భుత అవకాశం ఇది. దీన్ని వదులు కోకూడదని నిశ్చయించుకున్నాను. ఢిల్లీలో ఉండగా మహిళా సాధికారతకు సంబంధించి నేను కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశాను. ఆ అనుభవం నాకు ఇక్కడ పనికి వచ్చింది. ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగేందుకు

మన మేలుకోరేవారు మనకు వెలుగు నిచ్చేవారే , కాని చీకటి ముసిరితే కాని మనం వారిని గుర్తించం

కావల్సిన అంశాలపై దృష్టి పెట్టాను. అంతేకాదు, ఎప్పుడూ గుమ్మం దాటని ఆడవారి జీవితాల్లో వెలుగులు నింపి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ధ్యేయంగా పని చేయాలని అనుకున్నా. అందులో భాగంగా తొలుత తమ ఆశయాల సాధన దిశగా మహిళలను ప్రోత్సహించాను.

**గ్రంథాలయంతో మొదలు...**

ఆరంభంలో అందరూ నన్ను అవహేళన చేశారు. నీవల్ల ఏమవుతుందంటూ ప్రశ్నించారు. ఎవరు ఏమన్నా, ఎంత నిరుత్సాహపరిచినా... నా సామర్థ్యం ఏమిటో నాకు తెలుసు. సర్పంచ్‌గా నా తొలి ముద్ర గ్రంథాలయ నిర్మాణం. అధ్వాన్నంగా ఉన్న రోడ్ల పనుల వంటివి పక్కన పెట్టి ఎవరికీ ఉపయోగంలేని గ్రంథాలయం ఏంటని చాలామంది ప్రశ్నించారు. నాకు పిచ్చి పట్టిందని కొందరు వ్యాఖ్యానించారు. అది ఒక భవనం మాత్రమే కాదు... గ్రామంలోని భవిష్యత్ తరాల ఆశలు, ఆశయాలకు ఒక చిహ్నమని చెప్పాను. పిల్లల ఎదుగుదలలో గ్రంథాలయాల పాత్ర ప్రముఖమైనదని వివరించాను. అందులో అన్ని వయసుల వారికీ ఉపయోగపడేలా పంజాబీ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విలువైన పుస్తకాలు పెట్టాము. భద్రత కోసం సీసీ టీవీ కెమెరాలు అమర్చాం. క్రమంగా గ్రామస్తులందరూ గ్రంథాలయానికి వెళ్లడం అలవాటుగా మార్చుకున్నారు.

**కన్నీళ్లు పెట్టుకున్నారు...**

గ్రామ అభివృద్ధితో పాటు మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ఆ క్రమంలోనే ఇంటి ముందు నేమ్ ప్లేట్లు నన్ను ఆకర్షించాయి. అవి చూసినప్పుడు అనిపించింది... 'వాటిపై మగవారి పేరు మాత్రమే ఎందుకు రాయాలి' అని! గృహిణుల పేరుతో నేమ్ ప్లేట్లు రాయించాను. ప్రతి ఇంటి ముందూ వాటిని తగిలించాము. అవి చూసుకొని మహిళలు భావోద్వేగానికి లోనయ్యారు. 'మా ఆత్మగౌరవాన్ని నిలబెట్టావంటూ' కృతజ్ఞతలు చెప్పారు.

ఒక యువతి నా దగ్గరకు వచ్చి... 'ఇప్పటివరకు నన్ను బయటకు అడుగుపెట్టనివ్వలేదు. నా నిర్ణయాలు నేను తీసుకొనే స్వేచ్ఛ లేదు. కానీ ఇవాళ ఇంటి ముందు నా పేరు చూసినప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

ఇలా ఒక మహిళ పేరుతో డోర్ ప్లేటు కనిపించడం మా ఊళ్లో ఇదే మొదలు. ఈ ఏడాది సర్పంచ్‌గా నా పదవీకాలం అయిపోయింది. కానీ మహిళను సాధికారత వైపు నడిపించేందుకు, వారి జీవితాల్లో మార్పు తెచ్చేందుకు నా పయనం సాగుతూనే ఉంటుంది."

**మహిళలకు ప్రత్యేకం...**

మార్పు వైపు నేను వేసిన మలి అడుగు... మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక పార్కు ఏర్పాటు. నిత్యం ఇంటి పనుల్లో తలమునకలయ్యే ఆడవారికి తమకంటూ కాస్త సమయం కూడా దొరకదు. సరదాగా కాసేపు సేద దీరేందుకు అవకాశం ఉండదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని, తీరిక సమయంలో కాస్తంత ఆహ్లాదంగా గడిపేలా ఈ పార్కును తీర్చిదిద్దాము.

ఇది స్థానిక మహిళల్లో గణనీయమైన మార్పునకు కారణమైంది. ఒక్కొక్కరుగా ఇంటి నుంచి బయటకు వచ్చి, స్వేచ్ఛగా కాసేపు పార్కులో గడుపుతున్నారు. ■

## జైళ్ళ నుంచి వృద్ధులకు విముక్తి

జైళ్ళలో ఏళ్ళతరబడి మగ్గిపోతున్న వయోవృద్ధులకు విముక్తి కల్పించడానికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం శ్రీకారం చుట్టిందని అనంతపురంజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీ శివప్రసాద్ యాదవ్ తెలిపారు. న్యాయవిజ్ఞాన సదస్సులో శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. సబ్‌జైలులో ఉంటూ 70 పదుల వయసు దాటినా బయటకు వచ్చే పరిస్థితిలేని వారికోసం ఉన్నత న్యాయస్థానం మార్గనిర్దేశాలను జారీ చేసిందన్నారు.

వయోవృద్ధుల జాబితాలను తయారు చేయమని . అనారోగ్యం బారినపడి ఆఖరి దశలో ఉన్న వారి వివరాలను కూడా ఇవ్వాలని ఆదేశించినట్లు చెప్పారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో ఏళ్లుగా జైళ్లలో ఉంటున్న 70 ఏళ్లు దాటిన, అనారోగ్య పీడితులకు విముక్తి కలిగి, ఊరట లభించగలదన్నారు ■

# మనకు మార్కెట్‌లో దొరకని సంజీవని కూరగాయ !

దొడ్డిలో ఫ్రీగా పండే ఈ కూరగాయలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.. అవి ఏంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. రెండు అంటే రెండే నెలలు పండుతుంది..



అది కూడా ఎవరూ ఈ కాయను ప్రత్యేకంగా పండించాల్సిన పని లేదు.. దాని అంతకు అదే దొడ్డిలో పండుతుంది.. కానీ ఔషధాల గని !

ఈ కూరగాయ కేవలం రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో మాత్రమే కనిపిస్తుంది.. నిజానికి ఇది తెలుగు రాష్ట్రాల్లో అంతగా కనిపించదు.. ఒకవేళ కనిపించినా ఏదో అనుకొని దానినిగమనించే వారు  అరుదు.. కానీ ఈ కూరగాయ వల్ల ఎన్నో లాభాలు. వర్షాకాలంలో మాత్రమే మార్కెట్‌లో కనిపించే ఈ కూరగాయతో ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తుంది. కానీ కేవలం రెండు నెలలు మాత్రమే పండుతుంది.

'కచారియా' అనే ఈ కూరగాయ రుచికరమైనది మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. వర్షాకాలంలో ముఖ్యంగా ఖరీఫ్ పంటతో పొలాల్లో కచారియా లేదా కచ్రీ  దానంతట అదే పెరుగుతుంది. ఈ మొక్క మొత్తం నేలపై వ్యాపిస్తుంది.

కచ్రీ మొక్కలు పొలాల్లో పొదలుగా కనిపిస్తాయి. కచారియా కూరగాయలో కాల్షియం, విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది కండరాలను బలోపేతం చేయడానికి, కడుపులో గ్యాస్ తొలిగించడానికి, మలబద్ధకం వంటి సమస్యలను తొలగించడానికి ఎంతో సహాయపడుతుంది.

ఈ కూరగాయ తీసుకోవడం వల్ల శరీరంలో పేరుకుపోయిన మురికి బయటకు వస్తుంది. ఇది గుండె, మూత్రపిండాలను శుభ్రపరచడంలో కూడా సహాయపడుతుంది. వృద్ధులకు అయితే ఈ కూరగాయ ఇంకెంతో ఉపయోగపడుతుంది.

ఇన్ని లాభాలు ఇచ్చే ఈ కచారియా కూరగాయ వర్షాకాలంలో కేవలం 2 నుంచి 3 నెలల వరకు మాత్రమే స్థానిక మార్కెట్‌లో అందుబాటులో ఉంటుంది.

కిలో రూ. 40 నుంచి రూ. 70 వరకు ధర పలుకుతుంది. అందుకే ఈ కూరగాయ మీకు మార్కెట్‌లో దొరికితే అస్సలు వదలకండి.. ఇన్నీ లాభాలు ఉన్న కూరగాయను వదులుకుంటే సంజీవనిని వదులుకున్నట్టే !

■




ఏ ఒక్కరూ ప్రతిఒక్కరికీ సహాయంచేయలేరు, కాని ప్రతి ఒక్కరూ మరొకరికి సహాయం చేయగలరు

# నేల ఆరోగ్యం - ఉత్పాదకత పెంపుదల

ఆరోగ్యంగా ఉన్న నేలకు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే బలం ఉంటుంది
నేల ఆరోగ్యంగా ఉండాలంటే, అందులో తగినంత సేంద్రియ పదార్థం ఉండాలి

## చేపట్టే పనులు



MAHILA SADHIKARATHA
Publication Date: 01-01-2025 ; Posting Date: 05 & 06-01-2025
RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2024-26





12 ఎఫ్ పి ఓల పాలకవర్గ సభ్యులకు, సి ఇ ఓలకు శిక్షణ దృశ్యాలు




గుడిబండ మండలంలో రాగిసాగుపై అవగాహన సదస్సు ... తుముకూరు కె వి కె ప్రతినిధుల అవగాహన పర్యటన



ప్రశంసా పత్రాలతో 'వాష్' ఉత్తమ సి ఆర్ పి లు

To ADDRESS



పెద్దపల్లిలో ఎస్ ఎల్ ఎఫ్ ల సి ఆర్ పి లకు శిక్షణ